తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# మళ్ళీ తిరుపతిలో హోటళ్ళకు బాంబు బెదిరింపులు




తిరుపతికార్పొరేషన్,ఫిబ్రవరి 9ప్రభాతవార్త:
పుణ్యక్షేత్రం,యాత్రాస్థలం తిరుపతిలోని పలు హోటళ్ళకు మళ్ళీ బాంబుబెదిరింపు ఈమెయిల్స్ సంచలనం రేకెత్తిస్తున్నాయి. గత మూడునెలల క్రిందట ఇదే తరహాలో తిరుపతిలో అనేక హోటళ్లకు ఇలాంటి బాంబు బెదిరింపు ఫోన్‌కాల్స్, ఈమెయిల్స్ రావడంతో పోలీసుయంత్రాంగం అప్రమత్తమైంది. క్షణాల్లో హోటళ్ళకు చేరుకుని బాంబుడిస్పోజల్ టీమ్ పోలీసు జాగిలాలతో తనిఖీ చేశారు. మొన్న ఎస్వీవ్యవసాయకళాశాలకు బాంబు బెదిరింపు రావడంతో పోలీసులు తనిఖీచేసి ఉత్తుత్తేనని తేల్చారు. మళ్లీ శని,ఆదివారాల్లో తిరుపతిలోని హోటల్ ఫైవ్‌స్రాయ్, రీనెస్ట్ హోటళ్ళకు బాంబు బెదిరింపు ఈమెయిల్స్ రావడంతో ఏఆర్ పోలీసులు, తిరుపతి అలిపిరి పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఆ హోటళ్ళను తనిఖీచేసి ఏమీ లేదని తేల్చారు. యాత్రికులకు భయం పోగొట్టేలా పోలీసులు హోటళ్ళలో భద్రత చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలని కోరుతున్నారు.

### ఇక ప్రతి రైతుకు
## డిజిటల్ గుర్తింపు కార్డు
### ప్రభుత్వ పథకాలు పొందడానికి తప్పనిసరి: కలెక్టర్



చిత్తూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధార్ కార్డు తరహాలో ప్రతి రైతుకు డిజిటల్ గుర్తింపు కార్డులు ఇవ్వాలని నిర్ణయించాయి. విశిష్ట గుర్తింపు సంఖ్య(డిజిటల్ గుర్తింపు కార్డు) కల్గి వున్న రైతుకు మాత్రమే భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే వ్యవసాయ సబ్సిడీ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందనున్నాయి. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా సోమవారం నుండి రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్ నందు రైతుల నమోదు కార్యక్రమంకు శ్రీకారం చుట్టనున్నారు. రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవడానికి సంబంధిత రైతు సేవా కేంద్రం(ఆర్ఎస్‌కె) వద్దకు వెళ్ళాలి. రైతు సేవా కేంద్రంలో రైతు తన పేరు, గ్రామం, ఆధార్ నెంబర్, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కి లింక్ వున్న ఫోన్ నెంబర్ వివరాలను అందించాలి. రైతు సేవా కేంద్రంలో ఈ నమోదు ప్రక్రియ పూర్తయిన వెంటనే రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. ఒకవేళ రైతులు రైతు సేవా కేంద్రంకు వెళ్ళకుంటే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి తమ వివరాలను చెప్పినట్లైతే మీ ఫోన్‌కు వచ్చిన ఓటిపి నెంబర్ ద్వారా రైతు తన విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందవచ్చును. రైతులు డిజిటల్ గుర్తింపు కార్డులు కచ్చితంగా తీసుకోవాల్సి వుంటుంది. ఒకవేళ రైతులు డిజిటల్ గుర్తింపు కార్డును తీసుకోకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి రైతులకు ప్రయోజనం కలిగే పథకాలు ఏవి వర్తించవు. పంటల బీమా, పిఎం కిసాన్ యోజన, పంటనష్టపరిహారం, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్ర పరికరాలపై సబ్సిడీలు డిజిటల్ గుర్తింపు కార్డులు లేని రైతులు నష్టపోవాల్సి వుంటుంది. జిల్లాలో సోమవారం నుండి రైతు సేవా కేంద్రాల్లో ప్రారంభం కానున్న ఈ ప్రక్రియను ఫిబ్రవరి నెలాఖరులోపు పూర్తి చేయాలని వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు.

# తిరుపతిలో రాజకీయ రచ్చ!
### కిరణ్‌రాయల్ పార్టీ కార్యక్రమాలకు దూరం -కూటమిలో చిచ్చురేపేలా వ్యూహమేనా!?



ప్రభాతవార్త-న్యూస్‌నెట్‌వర్క్:
తెలుగురాష్ట్రాల్లోనే ప్రత్యేకత ఉన్న తిరుపతినియోజకవర్గంలో ఇప్పుడు రాజకీయ రగడ మొదలైంది. ఒక పార్టీపై మరొక పార్టీ ఖద్దరునేతలే చొక్కాలుచించుకుని వ్యక్తిగత విషయాలను వీధిలోకి లాగి రాజకీయంగా లాభపడేందుకు ప్రయత్నాలు చేస్తున్నారనేది జనంలో చర్చ. రాజకీయంగా పట్టుసాధించుకోవడంలో విఫలమైన కొందరు నేతలు నేతల వ్యక్తిగత విషయాలపై ధూషణలపర్వం మొదలుపెట్టడంతో ఎవరికి ఎంత లాభమనేది అసలు నిజాలు బయటకు వస్తేనే అనేది సామాన్యుల్లో నసుగుడు. రాష్ట్రంలో కీలకంగా ఉన్న టిడిపి,జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం తిరుపతిలో జనసేనపార్టీ అధికార ఎమ్మెల్యేగా కొనసాగుతున్నాడు. ఆయనపై సొంతపార్టీ నేతలే కొందరు తిరుగుబాటు జెండా ఎగురవేసిన సందర్భాలు లేకపోలేదు. పైగా మొన్నటికిమొన్న తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్‌లో ఒకేఒక్క టిడిపి కార్పొరేటర్‌ను ఏకంగా వైపిసి కార్పొరేటర్లు డిప్యూటీమేయర్ కుర్చీలో కూర్చోబెట్టడం రాజకీయంగా దెబ్బతీసినట్లయింది. పార్టీ ఫిరాయించిన 25మంది వరకు కీలక కార్పొరేటర్లు కూటమిపార్టీ వైపుచేరి మద్దతుపలకడంతో వైసిపి నేతలు కొందరు జీర్ణించుకోలేకపోతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ముల్లునుముల్లుతోనే తీయాలనే చందంగా రాజకీయకుట్రలను రాజకీయంగానే దెబ్బతీయాలనే పథకంతో రగడ మొదలుపెట్టారనేది జనసేనపార్టీలో ఒక వర్గం వాదనలు. అయినా గత కొంతకాలంగా జనసేననేత వ్యక్తిగతంగా చేస్తున్న కొన్ని కార్యకలాపాలు, ఆర్థికలావాదేవీలు,తన పూర్తివ్యక్తిగత స్వేచ్ఛ విషయాలపై ప్రత్యర్థి వైసిపి ఫోకస్ చేసిందనే విమర్శలు జనసేననేతలు చెబుతున్నారు. ఏదిఏమైనా తిరుపతి జనసేన ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ జనసేనాని ,డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు జనసేనపార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పుడు ఈ విషయం మరింత సంచలనంగా మారింది. అంతేగాక పార్టీకార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఆదేశించడంతో మరీ కిరణ్‌రాయల్ రాజకీయ భవిష్యత్తు ఏంటనేది కాలమే నిర్ణయించాల్సిన పరిస్థితి ఎదురైంది. తిరుపతికి చెందిన లక్ష్మి జిడినెల్లూరు నియోజకవర్గం కార్వేటినగరం మండలం కెవిబిపేట వాసిగా కూటమినేతలు పేర్కొంటున్నారు. ఇలా మొదలైన ఆమె ప్రస్థానం తన వ్యక్తిగత విషయాలతో కిరణ్‌రాయల్‌తో ఆర్థికలావాదేవీలు విషయం ఉండవచ్చనేది కూడా గుసగుసలు. తిరుపతిలో అటు వైసిపి ఇటు కూటమిలో జనసేనపార్టీలో రాజకీయరచ్చ మొదలైందనేది మాత్రం జనంలో బహిరంగవ్యాఖ్యలే వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే మరీ వైసిపిలోనూ కొందరు రుబాబులు ఉన్నారనేది జనసేనలో గుప్పుమంటోంది. అయితే పార్టీకార్యక్రమాలకు మాత్రమే దూరంగా ఉండాలని జనసేనపార్టీ ఉత్తర్వులతో వైసిపి నేతల్లో మింగుడుపడని విషయంగా మారింది. ఎంత మంది బాగోతాలు బయటకు రానున్నాయనేది కూడా తిరుపతిజనం ఆసక్తిగా చూస్తున్నారు.

# రంకెలేసిన కోడెగిత్తలు ... బరిలోకి దిగిన యువకులు



వెదురుకుప్పం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :
పాతగుంటలో జట్టుకట్టు సంబరాలు ఆదివారం అంబరాన్ని అంటాయి ....మండలంలోని పాతగుంట గ్రామంలో కనుమ పండుగాలో భాగంగా నిర్వహించే గిత్తల పందెలు నిర్వహించారు. సంబరాలలో కొడేగిత్తలు రంకేలు వేయడంతో

### పాతగుంటలో జల్లికట్టు సంబరాలు

యువకులు పౌరుషంతో బరిలోకి దిగడంతో జలికట్టు సంబరాలు అంబరాన్ని తాకాయి. రైతులు గిత్తలకు కొమ్ములు చెక్కి రంగులు వేసి చెక్క పట్టీలు కట్టి అందంగా అలంకరించారు. ఇష్ట దైవం, రాజకీయ నాయకులు, సినీ నటుల ఫోటోలతో కొమ్ములకు చెక్క పటీలు,టవలు, నగదు కట్టి యువత పై బరిలోకి దించారు. జన సంద్రంగా మారి పెద్ద సంఖ్యలో జనం చేరుకోవడంతో మిద్దెలు, వీధులు జన సంద్రంగా మారిపోయాయి. పోటా పోటీగా సాగిన గిత్తల పోరులో కొన్ని సార్లు గిత్తలదే పై చేయికాగా ... కొన్ని సార్లు యువకులదే పైచేయిగా మారింది. దుమ్ము రేపుతూ గిత్తలు చేసిన సందడిని మిద్దేల పై నుంచి వీక్షించిన చూపరులకు కనులవిందు చేసింది. చెదురు మదురు సంఘటలు మినహా అద్యంతం పోటీలు రసవత్తంగా జరిగాయి. గిత్తల పోటీలలో పలువురికి గాయాలైన్నాయి. ప్రశాంత వాతావరణంలో పండుగా నిర్వహించుకున్నారు. చుట్టపక్కల మండలాల నుంచి జనం తరలివచ్చారు. జల్లికట్టు సంబరాలను వీక్షించడంకు వచ్చిన వారికి అసౌకర్యం కలుగకుండా మంచినీటి వసతి, భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు.

# ముస్సోరి వెళ్లిన కమిషనర్ మౌర్య
### - ఇన్ఛార్జ్ కమిషనర్‌గా చరణ్ తేజ్ రెడ్డి



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త
ఈ నెల 10 నుండి 14వ తేదీ వరకు ఉత్తరాఖండ్ లోని ముస్సోరిలో జరగనున్న మునిసిపల్ గవర్నెన్స్ ఫర్ అడ్మినిస్ట్రేషన్ ఇన్ సర్వీస్ ట్రైనింగ్ కొరకు తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదివారం వెళ్ళారు. ఈ ఐదు రోజుల పాటు కార్యాలయ కార్యక్రమాలకు అంతరాయం లేకుండా అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డికి ఇంచార్జీ బాధ్యతలను అప్పగించారు. ఈనెల 10 నుండి 14వ తేదీ వరకు ఉత్తరాఖండ్ లోని ముస్సోరిలో మునిసిపల్ గవర్నెన్స్ ఫర్ అడ్మినిస్ట్రేషన్ ఇన్ సర్వీస్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఫర్ కెపాసిటీ బిల్డింగ్ ఆఫ్ సివిల్ సర్వెంట్స్ పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ తరపున తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఎంపిక చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరుపతి నగరపాలక సంస్థ కమిషన్ ఎన్.మౌర్య ఆదివారం ముస్సోరి బయలుదేరి వెళ్లారు.

# కల్తీనెయ్యిసరఫరాలో అరెస్టులు షురూ
### -సిబిఐ అదుపులో నలుగురు అరెస్టు



తిరుమల,ఫిబ్రవరి 9ప్రభాతవార్తప్రతినిధి:
తిరుమల వెంకన్న లడ్డూప్రసాదాల తయారీలో కల్తీనెయ్యి సరఫరా చేసిన కేసులో ఎట్టకేలకు సిబిఐ సిట్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ సరఫరాలో కీలకంగా వ్యవహరించిన తమిళనాడు ఏఆర్ డైరీ యాజమాన్యం ఎండి రాజశేఖరన్‌తోబాటు సరఫరా దారులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన విపిన్‌గుప్త, పోమిల్‌జైన్, అపూర్వచావ్డాలను సిబిఐ ఆదివారం సాయంత్రం అదుపులోకి తీసుకుంది. ఈ నలుగురిని సోమవారం ఉదయం తిరుపతిలో కోర్టులో హాజరుపరచనుందని సమాచారం. ఆదివారం రాత్రి సిబిఐ సిట్ చీఫ్ వీరేష్‌ప్రభు, మరో ఐదుగురు కీలక అధికారులు ఈ నిందితుల అరెస్టులో పాల్గొన్నారు. గత డిసెంబర్‌లో తిరుపతిలోనే సిబిఐ సిట్ అధికారులు తిష్టవేసి అనేక కోణాల్లో ఆధారాలు సేకరించారు. టీమ్ అధికారులు తిరుమల,తిరుపతికి చేరుకుని దాదాపు మూడువారాలు పాటు అన్ని కోణాల్లో దర్యాప్తు చేశారు. పలు రకాల రికార్డులు, ఆధారాలు సేకరించారు.

### నేడు జిల్లా కలెక్టరేట్‌లో
# గీత కులాల మద్యం షాపుల లక్కీడ్రా
### - ఈడిగ,గౌడ,గౌడ్ల దరఖాస్తు దారులు హాజరు కావాలి
### - తిరుపతి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.నాగమల్లేశ్వర్‌రెడ్డి వెల్లడి

తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త ః
తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం గీత కులాల మద్యం షాపుల లక్కీ డ్రా ఉంటుందని తిరుపతి జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె. నాగమల్లేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం కె. నాగమల్లేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. ఈడిగ, గౌడ, గౌడ్ల కులాలకు కేటాయించిన మద్యం షాపుల దరఖాస్తుల స్వీకరణ ఫిబ్రవరి 8వ తేది సాయంత్రం 5 గంటలకు ముగిసిందన్నారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో తిరుపతి జిల్లా నందు వివిధ మున్సిపల్ కార్పొరేషన్‌లకు, మున్సిపాలిటీలకు, మండలాలకు 23 మద్యం షాపులను కేటాయించి దరఖాస్తులను ఆహ్వానించడం జరిగిందని పేర్కొన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఈడిగ (25),పుత్తూరు మున్సిపాలిటీ గౌడ (13), శ్రీకాళహస్తి ఈడిగ (4), వెంకటగిరి ఈడిగ (5),గూడూరు ఈడిగ (6), నాయుడు పేట గౌడ (9), సూళ్ళూరుపేట గౌడ్ల (1), దొరవారి సత్రం మండలాలు గౌడ్ (4), ఒజిలి ఈడిగ (11),పెళ్ళకూరు గౌడ్ల (3),తొట్టంబేడు ఈడిగ (4), కె.విబి పురం ఈడిగ (9),ఎర్రవారి పాళ్ళెం ఈడిగ (5), డక్కిలి ఈడిగ (1), నారాయణవనం ఈడిగ (5), శ్రీకాళహస్తి రూరల్ మండలం ఈడిగ (3),బాలయ్యపల్లె ఈడిగ (4), నాగలాపురం గౌడ్ (5), చిట్టమూరు గౌడ్ (11), తిరుపతి రూరల్ ఈడిగ (30), వాకాడు గౌడ్ల (2), తడ ఈడిగ (17), వరదయ్య పాళ్ళెం ఈడిగ (8) మొత్తం 185 దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ పద్దతుల ద్వారా స్వీకరించడం జరిగిందని తెలిపారు. స్వీకరించబడిన దరఖాస్తులను పరిశీలించగా తిరుపతి రూరల్ మండలం నుంచి అత్యధికంగా (30) దరఖాస్తులురావడం జరిగిందని, అత్యల్పంగా సూళ్ళూరు పేట మున్సిపాలిటీ, డక్కిలి మండలాలకు ఒక్కొక్క దరఖాస్తు వచ్చినట్లు పేర్కొన్నారు. సదరు మద్యం షాపుల ఎంపిక, కేటాయింపు పక్రియ లాటరీ పద్ధతి ద్వారా ఫిబ్రవరి 10న ఉదయం 9 గంటల నుంచి తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని బీ బ్లాక్, సెకండ్‌ఫ్లోర్ మీటింగ్ హాల్ నందు షాపుల ఎంపిక, కేటాయింపు చేయబడునని తెలియజేశారు.

### నగరి రాజకీయ తెరపై
# గాలి జగదీశ్
### 12న ప్రతిపక్ష వైసిపిలో చేరిక



పుత్తూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :
రానున్న రోజుల్లో దివంగత నేత గాలి ముద్దుకృష్ణమనాయుడు తనయుడు గాలి జగదీశ్ నగరి నియోజకవర్గ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించనున్నారు. ఈ నెల 12వ తేదీన విజయవాడలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆ పార్టీ అధినేత వై.ఎన్.జగన్మోహనరెడ్డి సమక్షంలో చేరుతున్నారు. గత నెల మొదటి వారంలో జగన్మోహనరెడ్డిని వ్యక్తిగతంగా జగదీశ్ కలిసి పార్టీలో చేరేందుకు ఆసక్తి తెలిపారు. అయితే గత నెలాఖరున జగన్మోహనరెడ్డి ఇంగ్లండ్ పర్యటనలో వున్నందున అధికారికంగా పార్టీలో చేరేందుకు వీలు కుదరలేదు. ఇటీవల ఆయన పర్యటన ముగించుకుని వచ్చినందున 12న చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ముందుగా పెద్ద హడావుడి లేకుండా పార్టీలో చేరాలని అధిష్టానం చెప్పిన మేరకు నగరి నియోజకవర్గంలోని తన ముఖ్య అనుచరులతో జగదీశ్ గత రెండు రోజులుగా తిరుపతిలో సమాలోచనలు చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన ఆర్.కె.రోజా ప్రస్తుతం నగరి పార్టీని నడిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో జగదీశ్ వస్తే...పార్టీలో ఇబ్బందులు వస్తాయని రోజా గట్టిగా చెప్పినప్పటికీ జగన్మోహనరెడ్డి సున్నితంగా తిరస్కరించినట్లు జగదీశ్ వర్గం చెబుతోంది. నిజానికి ఈ నెల 19వ తేదీ తర్వాత చేరాలని జగదీశ్ భావించినప్పటికీ, ఆయన చేరికపై వస్తున్న ఎదురు గాలిని గమనించిన అధిష్టానం ఈ నెల 12వ తేదీనే చేరిపోవాలని ఆదేశించినట్లు చెబుతున్నారు. గత ఎన్నికల్లో గాలి భానుప్రకాశ్ టిడిపి తరపున ఎమ్మెల్యేగా గెలిచి నగరి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న పరిస్థితుల్లో ప్రతిపక్ష పార్టీ తరపున ఆయన సొంత, ఏకైక తమ్ముడు ప్రతిపక్షంలో చేరి నగరిలో రాజకీయాలు నడపడం అనే అంశం రెండు పార్టీల క్యాడర్‌లో పెద్ద చర్చనీయాంశమైంది. వైసిపి, టిడిపి రెండు పార్టీల్లోనూ అటు రోజా, ఇటు భానుప్రకాశ్ వైఖరి నచ్చక కొంత కాలంగా క్యాడర్‌లో అసంతృప్తిగా వున్న పలువురు జగదీశ్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని చెబుతున్నారు. శని, ఆదివారాల్లో స్వయంగా ఆయనను పలువురు కలిసి ఇప్పటికిప్పుడు తాము రాకపోయినా... భవిష్యత్‌లో మీతోనే వుంటామని జగదీశ్‌కు హామీ ఇస్తున్నారు. నగరిలో ఓటమి తర్వాత కూడా వైసిపి క్యాడర్ మాత్రం పదిలంగా, బలంగా వుంది. రెండు, మూడు సామాజిక వర్గాలు పార్టీని అంటిపెట్టుకునే వున్నాయి. కమ్మ సామాజిక వర్గానికి చెందిన గాలి జగదీశ్ వైసిపిలో చేరితే ఆ వర్గంలో కూడా చీలిక వచ్చి పార్టీ బలపడుతుందని ఆ పార్టీ పెద్దలు నమ్ముతున్నారు. ముద్దుకృష్ణమ మరణానంతరం ఆయన వారసుడిగా టిడిపి టిక్కెట్ ఆశించి జగదీశ్ భంగపడ్డారు. జగదీశ్ కంటే కొంత ఆలస్యంగా రాజకీయాల్లోకి వచ్చినా కూడా 2019 ఎన్నికల్లో పార్టీలో కొందరు నాయకుల తీవ్ర వ్యతిరేకతను అధిగమించి భానుప్రకాశ్ చాకచక్యంగా వ్యవహరించి టిడిపి టిక్కెట్ చేజిక్కించుకున్నారు.

# ఎస్వీయూ హాస్టల్లో కత్తితో విద్యార్థి హల్చల్
### తోటి విద్యార్థులతో గొడవ, ఒక విద్యార్థికి కత్తిపోట్లు

తిరుపతి విద్య, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త
ఎస్వీయూ హెచ్ బ్లాక్ హాస్టల్లో వర్సిటీలో ఎకనామిక్స్ విభాగంలో రెండవ ఏడాది చదువున్న మణికంత అనే డే స్కాలర్ విద్యార్థి రాత్రి 12గంటలకు మద్యం సేవించి హాస్టల్లోకి ప్రవేశించారు. అదే హాస్టల్ ఉంటున్న తన తోటి విద్యార్థులతో గొడవకు దిగాడు. ముగ్గరు విద్యార్థులపై దాడి చేసి మరో విద్యా ర్థిపై తన వెంట తీసుకువచ్చిన కత్తితో దాడి చేసి గాయపరిచారు. ప్రక్క రూమ్ విద్యార్థులు, సిబ్బంది ఎస్వీయూ పోలీస్లకు ఫిర్యాదు చేశారు. పోలీసలు మణికంత అనే విద్యార్థిని అరెస్ట్ చేసి అతని వద్దనున్న కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

# ఏకకాలంలో అందరికి పదవులు సాధ్యమా?
### ఆశావహుల్లో పెరుగుతున్న అసంతృప్తి



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త
'ఏక కాలంలో అందరికి నామినేటెడ్ పదవుల అవకాశం కల్పించటం సాధ్యమా?' అనేది ప్రశ్న. ఎలా సాధ్యమౌతుందనేది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావటానికి సీనియర్లు,జూనియర్లు, కొత్తవారు, పాత వారు అందరూ కలసి కట్టుగా పనిచేసి 43వేల ఓట్ల మెజారిటీతో తెలుగుదేశం అభ్యర్థి బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డిని గెలిపించుకున్నారు.ప్రభుత్వం ఏర్పడి సుమారు 8 నెలలు దాటింది.కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే 'నామినేటెడ్ పదవులు' వస్తాయని ఆశల పల్లకిలో పలువురు ఆశావహులు భావించారు. అయితే నామినేటెడ్ పదవుల్లో నియామకాలకు అవరోధాలు చోటు చేసుకున్నాయి.

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల అవకాశం ఉన్న సంస్థలు పరిమితం. అందులో శ్రీకాళహస్తీశ్వరాలయం ప్రధానం. ఇక్కడ ప్రస్తుతం మారిన నిబంధనల మేరకు 14 మందికిమాత్రమే ఎంఎల్‌ఏ పదవులు అందించే అవకాశం ఉంటుంది.ఇందులో రిజర్వేషన్లలో 7 మంది మహిళలు పోగా మిగిలిన ఏడులో కూటమి కాబట్టి మూడు పార్టీల వారికి అవకాశం కల్పించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి గెలిచినప్పటి నుంచి ప్రయత్నాలు సాగిస్తున్నారు. రెండు పర్యాయాలు బోర్డు నియమించుకోవాలనే పట్టుదలతో కృషి చేస్తున్నారు. కానీ ముందుకు సాగటం లేదు.ట్రస్టుబోర్డులో కేవలం తనకు అవకాశం ఉన్న ఏడుగురిలో కూడా రాష్ట్ర స్థాయిలోని వారు తమకూ అవకాశం కల్పించాలని కోరుతున్నట్లు సమాచారం. అయితే తాము సీనియర్లమని తమకు అవకాశం కల్పించకుంటే ఎలా అని రుసరుసలాడుతున్నారు. గతంలో సుధీర్‌రెడ్డి తండ్రి హయాంలో కూడా ఇదే అసంతృప్తి చోటు చేసుకుంది. ఆయన చాక చక్యంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న చిన్న ఆలయాలకు నిర్వహణ కమిటిలను నియమించి సంతృప్తి పరచారు.ఇక మార్కెట్ కమిటి,శ్రీకాళహస్తి కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు ఉంది. మరో రెండు సంస్థలు మున్సిపాలిటి,శ్రీకాళహస్తి కోఆపరేటివ్ పాలసరఫరా సంఘం. రెండింటికి ఎన్నికలు జరగాల్సి ఉంది.

**సమయసూర్తితో ముందడుగు . . .**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పార్టీ గెలుపుకోసం పని చేసిన వారికి ఎలాగైనా ఏదో ఒక నామినేటెడ్ పదవి అవకాశం కల్పించుటకు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి కృషి చేస్తున్నారు.ఎప్పటికప్పుడు పార్టీలోని వర్గాలకు భరోసా ఇస్తూన్నారు. పార్టీ కోసం పని చేసిన వారి సేవలను మరువదని సర్దిచెబుతున్నారు.అయితే కొందరు తీవ్ర అసంతృప్తితో అసహనంతో కొట్టుమిట్టాడుతున్నారు.

### కాణిపాకం సన్నిధిలో
## ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



కాణిపాకం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:
ఏపీ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఏపీ హైకోర్టు చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్‌లు ఆదివారం రాత్రి కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ పెంచల్ కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, చిత్తూరు కోర్డు జడ్జిలు,ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు కోదండపాణి,ఐరాల తహశీల్దార్ మహేష్‌కుమార్, స్థానిక ఎస్సై ధరణీధర, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు సేవా కేంద్రాల్లో నేటినుంచి నమోదు కార్యక్రమం

కుప్పంరూరల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

రైతులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు డిజిటల్ గుర్తింపు కార్డులు మంజూరు చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఫయాజ్ బాషా తెలిపారు. ఇందుకోసం సోమవారం నుంచి రైతు సేవా కేంద్రాల్లో రైతుల వివరాలు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇందుకోసం రైతులు ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ లింక్ అయిన ఫోన్ నెంబరును తీసుకుని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకుల ద్వారా ఈనెల 28వతేది లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పంటబీమా, పిఎంకిసాన్ యోజన, పంటనష్టపరిహారం, అన్నదాత సుఖీభవ, యంత్రాలపై రాయితీల కోసం రైతులకు డిజిటల్ గుర్తింపు కార్డులు తప్పనిసరి అని తెలిపారు.

## కాణిపాకం పుష్కరిణిలో గణనాధునికి కళానివేదన

కాణిపాకం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:



సత్యప్రమాణాలకు నెలవైన కాణి పాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం ఆలయపుష్కరిణి వద్ద ఆదివారం రాత్రి స్వామివారికి కళానివేదన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రతి నెలా ఆలయంలో దేవాదాయశాఖ ఆదేశా ల మేరకు పుష్కరిణి వద్ద కళానివేదన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈమేరకు ఆలయ పుష్కరిణి వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై చిత్తూరుకు చెందిన చిన్నారులు భక్తి గీతాలను ఆలపించారు. ఈభక్తిగీ తాలు ఆహూతులను అలరింపజేశాయి.ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఆర్ ఆస్పత్రిచే ఉచిత వైద్య శిబిరం

రామకుప్పం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త



కుప్పం ఆర్ఆర్ ఆస్పత్రి అధినేత డా॥ సురేష్ మునిరత్నం అధ్వర్యంలో ఆదివారం రామకుప్పంలోని శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా దాదాపు 105మందికి ఉచితంగా వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, మాత్రలు పంపిణీ చేశారు. ప్రజలకు ఆలయ కమిటి నిర్వాహకులు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పివి సీతాపతి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి ఎస్పీ మణికంఠ చందోలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ సమస్యలను ఎస్పీ మణికంఠ చందోలుకు విన్నవించుకుంటే వాటిని పరిశీలించి పరిష్కరించడానికి ఎస్పీ చర్యలు తీసుకుంటారు.

## గ్రంథాలయంలో అంబేద్కర్ చిత్రపటం ఏర్పాటుచేయాలి

పూతలపట్టు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త

గ్రంథాలయంలో అంబేద్కర్ చిత్రపటం లేదని దళితులు సంఘాలు. దళిత ఉద్యోగులు వాపోతున్నారు. పూతలపట్టులో ఆరు సంవత్సరాలుగా పని చేస్తున్న గ్రంథాలయ అధికారి దళిత ద్రోహిగా ఆరు సంవత్సరాలుగా పని చేస్తున్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 24 గంటలు లైబ్రరీ నందు పుస్తకాలు చదువుతూ ఉండేవాడు. అందుకే ఆయన్ను పుస్తకాల పురుగు అంటారు. అంబేద్కర్ వివిధ దేశాల తిరిగి అన్ని రాజ్యాంగాలను పరిశీలించి మనకు మంచి రాజ్యాంగాన్ని రచించాడు. గ్రంథాలయంలో అంబేద్కర్ చిత్రపటం ఏర్పాటుచేయాలని కోరారు.

## విద్యార్థుల ఉన్నతస్థితికి తోడ్పాటు అందిస్తున్న ధరణి అబాకస్

–నేషనల్ కాంఫిటీషన్ అవార్డ్స్ పంక్షన్‌లో వక్తలు




తిరుపతి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

విద్యార్థులకు అబాకస్‌లో అత్యుత్తమైన శిక్షణ ఇస్తూ, విద్యార్థులను ఉన్నతస్థాయికి చేర్చుతున్న ధరణి అబాకస్ కృషి ప్రసంశనీయమని నేషనల్ సాన్‌స్కిట్ యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ జిఆర్ఎస్ క్రిష్ణమూర్తి, చిత్తూరు ఆర్డిఓ ఎం.శ్రీనివాసులు, ఆర్డిఓ కిరణ్‌కుమార్‌లు అన్నారు. ఆదివారం గంధమనేని శివయ్యభవన్ ధరణి అబాకస్ నేషనల్ లెవల్ రాఫిడ్ కాంపిటిషన్స్ అవార్డ్సు పంక్షన్‌ను ఘనంగా నిర్వహించారు. 1540 మంది ధరణి అబాకస్ విద్యార్థులకు కాంఫిటీషన్ నిర్వహించగా అందులో 430 మంది విద్యార్థులు ప్రతిభ చూపించారని, వీరందరికి మెమోంట్‌లు, సర్టిఫికేట్స్ ప్రదానం చేసారు. అనంతరం ధరణి అబాకస్ విద్యార్థులకు లైవ్ డెమోన్‌స్ట్రేషన్ నిర్వహించారు. డైరెక్టర్ రవికుమార్ అడిగిన ప్రశ్నలకు పెన్ను, పేపర్ లేకుండా అతి తక్కువ సమయంలో చకచక సమాధానాలు చెప్పడంతో సభికులను ఆశ్చర్యపరచగా, తల్లిదండ్రులలో ఆనందోత్సవాలు నెలకున్నాయి. ప్రస్తుత పరిస్థితులలో పిల్లలు సెల్‌ఫోన్‌లకు బానిసలై, చదువుపై శ్రద్ధ చూపడం లేదన్నారు. ఇది భవిష్యత్‌లో పిల్లలరే చాలా ప్రమాదకరమన్నారు.అబాకస్‌లో శిక్షణ పొందడం వల్ల పిల్లల్లో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రామానాయుడు, ఎడిఫై స్కూల్ డైరెక్టర్ ప్రణీత్, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్, శేషాద్రి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య

పాలసముద్రం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇవ్వాలని నిర్ణయించడంతో సోమవారం నుండి మండల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇస్తారని మండల వ్యవసాయ అధికారి ఢిల్లీ ప్రసాద్ తెలిపారు. రైతులు తమ పేరు, గ్రామం, ఆధార్ నెంబర్, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కు లింకు అయిన ఫోన్ నెంబర్ వివరాలను తీసుకెళ్ళి గ్రామ వ్యవసాయ సహాయకుల వద్దకు వెళితే వారు ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్‌లో రైతుల పేర్లను నమోదు చేసి విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇస్తారన్నారు. రైతులు ఫిబ్రవరి నెలాఖరులోపు ఈ విశిష్ట గుర్తింపు సంఖ్యను తీసుకోవాలని ఆయన కోరారు.

## సిఎంను కలిసిన రాగిమానుపెంట సర్పంచ్

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:



విజయవాడ నగరం తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడును రాగిమానుపెంట సర్పంచ్ తోట శ్రీహరి కలిశారు. పంచాయతీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను సిఎం దృష్టికి తీసుకెళ్ళారు. అలాగే బంగారు పాళ్యం నుండి రాగిమానుపెంట వరకు 8 కిమీ బిటి రోడ్డు ఆధ్వాన్న స్థితికి చేరుకుందని సిఎం దృష్టికి తీసుకెళ్ళిరు. ఈ రహదారి గుండా రాగిమా నుపెంట, వెలుతురుచేను, కెఎం కండ్రిగ, కీరమంద, బండ్లదొడ్డి, లక్ష్మీపురం తదితర గ్రామాలకు చెందిన గ్రామస్తులు నిత్యం ప్రయాణిస్తువుంటారని తెలిపారు. అలాగే ఎగువ రాగిమానుపెంటకు చెందిన భారత సైనికుడు కార్తీక్ కాశ్మీర్ ఉగ్రదాడిలో మృతి చెందాడని, అతని పేరిట కాలనీ పెట్టామన్నారు. అలాగే కార్తీక్ కుటుంబానికి ప్రభుత్వం అందించే సహాయంను అందించాలని కోరారు.

## లభ్యమైన మృతదేహం

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:



మొగిలి ఘాట్ అటవీ ప్రాంతం గౌనిచెరువులో ఈత కెళ్ళి మృతి చెందిన సెల్వకుమార్(27) మృతదేహం ఆదివారం మధ్యాహ్నం లభ్యమైంది. మొగిలి శ్రీని ఫుడ్ పార్క్ నందు పొలరాన్ జ్యూస్ కంపెనీలో పని చేస్తున్న సెల్వకుమార్‌తో పాటు మరో ముగ్గురు శుక్రవారం సాయంత్రం గౌని చెరువుకు ఈతకు వెళ్ళారు. ఆ సమయంలో సెల్వకుమార్ నీటిలో మునిగి మృతి చెందాడు. మృతదేహం కోసం మూడు రోజుల పాటు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ముమ్మరంగా గాలించారు. చివరకు ఆదివారం మధ్యాహ్నం సెల్వకుమార్ మృతదేహం లభ్యం కావడంతో మృతదేహంను శవ పరీక్ష నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు స్థానిక సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సిఎం చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని ఇంటింటా ప్రచారం చేయాలి

– ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాలను పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం సూచించారు.ఆదివారం మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ అధ్యక్షతన స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో మున్సిపల్ పార్టీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారంకై సిఎం చంద్రబాబునాయుడు ప్రారంభించిన జననాయకుడు పోర్టల్‌పై పార్టీ నేతలు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేయాలని కుప్పం తెదేపా కార్యాలయంలో సిఎం చంద్రబాబునాయుడు జన నాయకుడు గ్రీవెన్స్ సెల్ ఏర్పాటుచేయించారన్నారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను గ్రీవెన్స్ సెల్‌లో అందజేస్తే వాటి పరిష్కారంకు ఆయా ప్రభుత్వ శాఖలు, పార్టీ ద్వారా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇందుకోసం ఇక్కడ ప్రత్యేక బృందం పనిచేస్తోందన్నారు. అలాగే నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు ప్రజలకు తెలపాలన్నారు. అనంతరం వివిధ అంశాలపై చర్చించారు. సమావేశంలో రాష్ట్ర నేతలు గోపీనాథ్, డా॥ సురేష్‌బాబు, డా॥ వెంకటేష్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం , మాజీ మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, కార్పొరేషన్ ఛైర్మన్ వేణుగోపాల్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, కౌన్సిలర్లు సోమశేఖర్, జాకీర్, సెల్వరాజ్, సురేష్, వేలు, నేతలు ఆర్ముగం, సత్యేంద్రశేఖర్, కన్నన్, ఆర్ఆర్ రవి, డికెపల్లి మణి, శివదేవర్, మహిళా నేతలు భాగ్యలక్ష్మి త్రిలోక్, తిరుమగళ్ పాల్గొన్నారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

– కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్



కుప్పం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంను సోమవారం కుప్పం మండల కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 1గంట దాకా ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## యాత్రీకులతో స్నేహభావంతో మెలగాలి

ఉపకమీషనర్ ఏకాంబరం

బోయకొండ(చౌడేపల్లి), ఫిబ్రవరి 9 ప్రభాతవార్త



శక్తిక్షేత్రం బోయ కొండ గంగమ్మ ఆలయానికి వచ్చే యాత్రీ కులతో స్నేహ భావం తో మెలగాలని కిందిస్థాయి అధికారులు, సిబ్బందికి ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం సూచించారు. ఆదివారం కొండ దినం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా ఏకాంబరం ఆలయంలోని క్యూలైన్లు, పెద్దభోగం, వాహన పార్కింగ్, అమ్మవారి గర్భాలయం వంటి ప్రాంతాలను పర్యవేక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో తరలివస్తున్న యాత్రీకులను దృష్టిలో వుంచుకొని మౌళిక వసతులు సమకూర్చుతున్నామన్నారు. ముఖ్యంగా రానున్న వేసవి సందర్భంగా ఆలయంలోని క్యూలైన్లు, ఇతరత్రా ప్రాంతాల్లో మంచినీటి వసతి కల్పనకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది. కొండదినాన్ని పురస్కరించుకొని వేదపండితులు, అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణగావించారు.

## చౌడేపల్లి బస్టాండులో అన్నదానం

చౌడేపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త



పుంగనూరు నియోజకవర్గ యువనేత మాది రాజు ప్రదీప్‌రాజు జన్మదినం సందర్భంగా మాదిరాజు ప్రదీప్‌రాజు యువసేన అభిమానులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండులో బాణాసంచాలు పేల్చి కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం పేదలకు అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. ప్రజా శ్రేయస్సు కోసం అహర్నిశలూ శ్రమించే మాదిరాజు ప్రదీప్ రాజు సమ కాలిన రాజకీయాలకు ఆదర్శ ప్రాయుడని కొనియాడారు. మాదిరాజు ప్రదీప్‌రాజు యువసేన సభ్యులు పాల్గొన్నారు

## అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

చౌడేపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం మేరకు...మండలంలోని పెద్దయల్లకుంట్ల పంచాయతీ ఊటూరు వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం రావడంతో వెళ్ళి సోదాలు నిర్వహించారు. బస్టాప్ వద్ద జరిగిన సోదాలో అదే గ్రామానికి చెందిన చంద్రబాబును అదుపులోకి తీసుకొని అతని నుంచి ఆంధ్రాకు చెందిన 12క్వార్టర్ బాటిళ్ళను స్వాధీన పరచుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు. కాగా చంద్రబాబుపై గతంలోనూ నాటుసారా కేసు ఉందని ఎస్ఐ తెలిపారు.

## నీలగిరి తోట దగ్ధం



పుంగనూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త

మండలంలోని ఆరడుగుంట పంచాయతీ మేలందొడ్డి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం చక్రవర్తి అనే రైతుకు చెందిన నీలగిరి తోట అగ్నికి దగ్ధమైంది. మధ్యాహ్నం కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు తోటలో ఉద్దేశపూర్వకంగా నిప్పంటించడంతో నీలగిరి తోట సగభాగం కాలిపోయింది. మంటలను గమనించిన స్థానికులు పుంగనూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది మంటలు చేశారు. ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు ఆధ్వర్యంలో వినోద్ కుమార్ సురేష్ బాబు సుబ్రహ్మణ్యం ప్రసాద్ తదితరులు సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తోట నష్టం విలువ రూ.12 వేలు ఉంటుందని అంచనా.

## ఆల్ ఇండియా బంజారా చీఫ్ అడ్వైజర్ మునీంద్రనాయక్



పుంగనూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంఘ చీఫ్ అడ్వైజర్‌గా పుంగనూరుకు చెందిన డాక్టర్ బాణావతి మహేంద్ర నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరులో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆలిండియా బంజారా సేవా సంఘం చీఫ్ అడ్వైజర్‌గా ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచిడాక్టర్ బాణావతి మునీంద్ర నాయక్‌కు ప్రాతినిధ్యం లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ బాణావతి మునీంద్ర నాయక్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో ఉన్న బంజారాల యొక్క సంస్కృతి సాంప్రదాయం, విద్య, ఉపాధి, సంక్షేమం కొరకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారికి న్యాయం చేస్తామని తెలియజేశారు. బంజారాల యొక్క సంస్కృతి సాంప్రదాయాలని పరిగణలో తీసుకొని బంజారా కళాకారులకు రూ.4 వేల పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశ సభ్యులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ హాస్టల్ పదో తరగతి విద్యార్థులకు శిక్షణ తరగతులు

కేవీబీ పురం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోసాంఘిక సంక్షేమశాఖ శ్రీకాళహస్తి పరిధిలోని బాల బాలికల వసతి గృహంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు మార్చిలో జరగబోయే పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత పొందేలా విద్యార్థులకు ప్రేరణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజనల్ అధికారి భానుప్రకాష్‌రెడ్డి, తిరుపతి జిల్లా షెడ్యూల్డ్ కులంసంక్షేమ, సాధికారత అధికారి విక్రమ్ కుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా షెడ్యూల్డ్ కులముల సంక్షేమ, సాధికారత అధికారి విక్రమ్ కుమార్‌రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి పరీక్షలకు సిద్ధమయ్యే క్రమంలోఎదురయ్యే ఒత్తిడులను జయించడానికి యోగా, ధ్యానం ఎలా ఉపయోగపడుతాయో తెలియజేసి విద్యార్థుల్లో ప్రేరణ కలిగించారు. అనంతరం వివిధ సబ్జెక్టుల్లో ఉపాధ్యాయులచే శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి సహాయ సాంఘికసంక్షేమ అధికారి సి.ఆనందరావు, ఉపాధ్యాయులు పి.వేణు నాయుడు, ప్రశాంత్, ఆర్.నాగేష్‌బాబు, లింకన్, మాస్టల్ వెల్ఫేర్ అధికారులు పి.సదాశివయ్య, జి.రవి, సి.సుభాషిణి, ఎన్.సుమన్‌బాబు, ఎన్.హేమలత, పి.నాగమణి, 4వ తరగతి సిబ్బంది పాల్గొన్నారు.

## కుంభాభిషేకంలో మాజీ మంత్రి రోజా

పుత్తూరురూరల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణం కాపు వీధిలో శ్రీ సుందర వినాయక స్వామివారి నూతన ఆలయ అష్టబంధన విగ్రహ ప్రతిష్ట మహా కుంభాభిషేక మహోత్సవంలో మాజీ మంత్రి రోజా ఆదివారం పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు వేద పండితులు మాజీ మంత్రికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. సుందర వినాయక స్వామివారికి విశేషంగా జరిగిన మహా కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా మంగళవాయిద్యం, విఘ్నేశ్వర పూజ, యజమాన సంకల్పం, ఆదివాస యోగశాల పూజ, హోమం, పూర్ణహుతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ కార్యక్రమంలో పుత్తూరు మున్సిపాలిటీ వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీని కలసిన సత్యవేడు ఎస్సీ సెల్ అధ్యక్షుడు

కేవీబీ పురం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విక్రమ్‌రెడ్డిని సత్యవేడు ఎస్సీ సెల్‌అధ్యక్షుడు వి.సాధు కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ లోన్లు, ఎస్సీలు ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి, ప్రభుత్వం తరపున సబ్సిడీ లోన్లు గురించి, చిన్న తరహా పరిశ్రమంలో ప్రభుత్వం తరపున అధికంగా సబ్సిడీలను అందించడం, నిరుద్యోగులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, వ్యవసాయ దారులకు వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు, రోటవేటరు, వరి కోత మిషన్, ఆటో, జేసీబీ, ఇన్నోవా కార్లు, కూలీ పని చేస్తున్న వారిని యజమానిగా చేయాలని ఆయన ఈడీని కోరారు. ప్రభుత్వ ధ్యేయం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి, సబ్సిడీలు రుణాలు అందించి ఆర్థిక అభివృద్ధి చేయాలని సత్యవేడు నియోజకవర్గం రిజర్వుడ్ నియోజకవర్గం ఎస్సీల జనాభా ఎక్కువ ఉందని, సబ్సిడీఎక్కువ చేయాలని అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి ఉంచాలని ఈడీని కోరారు. అనంతరం ఈడీని కలసి మర్యాదపూర్వకంగా శాలువతో సన్మానం చేశారు.

## నేడు తిరుపతిలో మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సమావేశం




తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త ః

ఏఐటీయూసీ అనుబంధ సంఘమైన మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం తిరుపతిలో సోమవారం నిర్వహించనున్నట్లు మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి పి.మహేంద్ర తెలిపారు. ఈ సమావేశానికి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజారెడ్డి, ప్రకాష్‌లు హాజరవుతారని, రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ అందరూ ఈ సమావేశంలో పాలల్గొంటారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ పడుతున్న సమస్యలపై చర్చించి వాటిని ఏవిధంగా పరిష్కరించుకోవాలనే అనే అంశంపై పోరాట రూపకల్పన కార్యక్రమం ఈ సమావేశంలో నిర్ణయించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## వైకాపా మండల కన్వీనర్ వేణుగోపాల్‌రాజుకి సన్మానం



నింద్ర, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

వైకాపా మండల కన్వీనర్‌గా మూడవసారి వేణుగోపాల్‌రాజుని మాజీ మంత్రివర్యులు ఆర్‌కె రోజా,మండలంలోని నాయకులు,కార్యకర్తలు,అబిమానులు ఆదివారం ఘనంగా సన్మానించినారు. నాపై నమ్మకంతో మూడో పర్యాయం కూడా నన్ను మండల కన్వీనర్‌గా నియమించడం నాఅదృష్టంగా భావించి పార్టీకి,కార్యకర్తలకు అందుబాటులో వుండి ప్రజా సమస్యపై పోరాటం చేస్తానని వేణుగోపాల్‌రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో యంపిపి దీపా జలంధర్‌రాజు,రాష్ట్ర వైకాపా యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్,కోఆప్షన్ మెంబరు అనిల్,నాయకులు పరందామయాదవ్,బాబురెడ్డి, తోయజాక్షిరెడ్డి, శివలింగాచ్చారి,మునిక్రిష్ణారెడ్డి,సత్యరాజ్,రాము,రామచంద్రారెడ్డి,చార్లీ,దినకర్,గోపిక్రిష్ణ,గౌరి,సుబ్రమణ్యం,మురళీ తదితరులు పాల్గొన్నారు.

## మంటల్లో గాయపడిన మహిళ మృతి

తిరుపతికార్పొరేషన్,ఫిబ్రవరి 9ప్రభాతవార్త:

అలిపిరి పోలీసుస్టేషన్ పరిధిలో వారంరోజులక్రిందట ఓ అపార్టుమెంట్‌లో కాపురముంటున్న ఎంఎం శాంతషీలా స్టౌవెలిగిస్తూ ప్రమాదవశాత్తు మంటలులేచి తీవ్రంగా గాయపడింది. ఆమెను స్థానికులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు అలిపిరి పోలీసులు తెలిపారు.

## 12న త్రిశూల స్నానానికి సన్నాహాలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం మహాశివరాత్రికి ముస్తాబౌతుంది. శివరాత్రికి ముందు 15 రోజుల నుంచి ఉత్సవాలే ఉత్సవాలన్నట్లు మారుతుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 12న పవిత్ర జీవనది స్వర్ణముఖి నదిలో త్రిశూల స్నానం నిర్వహించటం .జరుగుతుంది. పంచమూర్తులను స్వర్ణముఖి నదిలోకి తరలించి అక్కడ సద్యోముక్తి ఉత్సవం నిర్వహిస్తారు. తరువాత పంచమూర్తులను గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవానికి పట్టణానికి చెందిన వారే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళా భక్తులు విశేష సంఖ్యలో హాజరౌతారు. ఈనేపథ్యంలో విషయం తెలుసుకున్న ఇఒ టి.బాపిరెడ్డి ఏర్పాట్లను గురించి ఆదివారం ఇఇ మురళీధర్‌రెడ్డితో చర్చించారు. ఈ సందర్భంగా చక్కటి చలువ పందిళ్ళతో పాటు వచ్చిన మహిళా భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

## నిరుపేదల ఆకలి తీర్చటమే లక్ష్యంగా . . .

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తి శ్రద్దలతో వచ్చే నిరుపేదల ఆకలి దప్పులు తీర్చటమే లక్ష్యంగా టూరిస్టు బస్టాండు సమీపంలోని సుబ్రమణ్యం స్వామి ఆశ్రమ వ్యవస్థాపకులు కృషి చేస్తున్నారు. పట్టణంలోని పెద్దల వద్ద బిక్షాటన చేసి ఆశ్రమంలో పేదల ఆకలి దప్పులతో పాటు నిరుపేదల కాలనీల్లో పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. ఆదివారం ఆలయానికి విపరీతమైన రద్దీ వచ్చింది. టూరిస్టుబస్టాండు వద్ద భక్తులు నిండిపోయారు. గమనించిన ఆశ్రమ వ్యవస్థాపకులు స్వయంభువు సాంబ్రాణి స్వామి వెంటనే భోజన వసతి కల్పించారు. యాత్రికులకే కాకుండా వేదాం పరిసర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఉదయం అంబలి, మధ్యాహ్నం జోజన వసతి కల్పిస్తున్నారు. అంతేకాకుండా పసిబిడ్డలకు, ఆలయంలో వెలసిన స్వయంభువు స్వామికి పాలను అందిస్తున్నారు.

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పరామర్శ

విజయపురం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:



మండలంలోని ఇళ్ళత్తూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన బాధిత కుటుంబాలను ఆదివారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ వాళ్ళ ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆ గ్రామంలోని టీడీపీ నాయకుడు ముని భాస్కర్‌రాజు తమ్ముడు సురేష్‌వర్మ కుమారుని కేశఖండవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, స్థానిక నాయకులు మునిభాస్కర్‌రాజు, ఏళుమలై, వరదరాజు, కొల్లాపూరి, మనీ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ బలోపేతానికి కృషి చేద్దాం

– మాజీ మంత్రి రోజా

విజయపురం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:



నాయకులు, కార్యకర్తలు కలసి కట్టుగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని మాజీ మంత్రి రోజా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం నగరి మాజీ మంత్రి కార్యాలయంలో విజయపురం మండల వైసీపీ కన్వీనర్‌గా ఎన్నికైన శివరాజు, మండల నాయకులు, కార్యకర్తలు పలువురు ఆమెను మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో తాను ఉంటానని, అందరం కలసికట్టుగా పార్టీ అభివృద్ధికి కృషి చేసి వచ్చే ఎన్నికల్లో మరల వైసీపీ అధికారంలోకి వచ్చి జగన్మోహన్‌రెడ్డి పాలన తీసుకురావాలన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన మండల కన్వీనర్ శివరాజు మాట్లాడుతూ నాకు ఈ పదవి రావడానికి కృషి చేసిన మాజీ మంత్రి రోజమ్మకు, మండల పార్టీనాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## నేటి నుంచి స్కిల్ డెవలప్మెంట్ పై జాతీయ సదస్సు

తిరుపతి విద్య, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

పద్మావతి మహిళా వర్సిటీలో ఎమ్ఎస్ఎమ్ఎ సహకారంతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు సోమవారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. అడ్వాన్స్డ్ ఎంటర్ప్రెన్యూర్ షిప్ స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం 2024-25 సంబంధించి పేటెంట్ అప్లికేషన్ డ్రాఫ్టింగ్ అండ్ ఫైలింగ్ ప్రొసీజర్స్ ఇన్ ఇండియా అనే అంశంపై జాతీయ సదుస్సు జరగనుంది.

## నేడు మీకోసం - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త



డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి తెలిపారు. తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో ఈ నెల 10వ తేది సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఉదయం 10.30 గంటల నుండి నిర్వహించనున్నట్లు, 9.30 గంటల నుండి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి తెలిపారు. ప్రజలు తమ స్థానిక సమస్యలపై అర్జీలు అందించవచ్చుని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య ఆదివారం తెలిపారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపర్చాలని కమిషనర్ తెలిపారు.

## ప్రభుత్వ భూమి దర్జాగా ఆక్రమించి...లక్షల్లో అద్దెకు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:




తిరుపతిరూరల్ మండలం తుమ్మల గుంట గ్రామ లెక్కదాఖల సర్వేనెంబర్ 18/2లో ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తి దర్జాగా ఆక్రమించి...లక్షల్లో అద్దెకు ఇచ్చారని స్థానికులు ఆరోపించారు. మహిళా విశ్వవిద్యాలయానికి సమీపంలో విఐపి మెయిన్ రోడ్డులో ఉన్న ప్రవేట్ బ్రాందిషాపును ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసారని ఆరోపించారు. ఆ బ్రాంది షాపు చుట్టు పక్కల కాలేజ్‌లు ఉన్నాయని, అబ్కారీ నిబంధనలను కూడా ఉల్లంఘించి షాపు ఏర్పాటు చేసారని తెలిపారు. గతంలో అప్పటి కలెక్టర్ ప్రద్యుమ్న ఆస్థలంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయనీయలేదని విషయాన్ని గుర్తు చేసారు. తిరుపతిరూరల్ రెవెన్యూ అధికారులు మద్యం దుకాణం నడిపిస్తున్న ప్రహారికి ప్రభుత్వ స్థలమని హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేసిన విషయాన్ని తెలిపారు. అబ్కారీ, రెవెన్యూ అధికారులు స్పందించి, ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## నేడు గీత కులాల మద్యం షాపులకు లక్కీడ్రా

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

గీతకులాలవారికి కేటాయించిన మద్యం షాపులకు సోమవారం ఉదయం 10గంటలకు కలెక్టరేట్‌లోని బి-బ్లాక్ రెండో అంతస్తులోని మీటింగ్ హాలులో లక్కీ డ్రా నిర్వహిస్తున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండ్ నాగమల్లేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లా పరిధిలోని మున్సిఫల్ కార్పొరేషన్స్, మునిసిపాలిటీలకు, మండలాల్లో ఉన్న గీకులాలకు 23 మద్యం షాపులకు ధరఖాస్తులు ఆహ్వానించగా 185 ధరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అత్యధికంగా తిరుపతిరూరల్ మండలంలో ఒక షాపు నిర్వాహణకు 30 ధరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అత్యల్పంగా సూళ్ళూరుపేట మునిసిపాలిటీ, డక్కిలి మండలాల్లో ఒక్కో ధరఖాస్తు మాత్రమే వచ్చినట్లు తెలిపారు.

## ఢిల్లీ ఎన్నికల్లో వికసించిన కమలం

కేవీబీ పురం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

ఢిల్లీ ఎన్నికల ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ అధిక మెజారిటీసాధించి రికార్డు క్రియేట్ చేసిందని బీజేపీ మండల అధ్యక్షుడు నాలి బాబుయాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం వద్ద బీజేపీ నాయకులు టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. ప్రధాని మోదీ అందిస్తున్న సుపరిపాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఢిల్లీ ప్రజలు నమ్మకం ఉంచి బీజేపీని అఖండ మెజారిటీతో గెలిపించారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో దక్షిణాది రాష్ట్రాల్లో కూడా కమలం వికసించబోతుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగేషన, వెంకటముని, వెంకటకృష్ణ, మోహన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐసిఎంఎఐ తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో ఘనంగా అస్పైర్ 2025

తిరుపతి విద్య, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త



ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఎంఎఐ), తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో "అస్పైర్ 2025" సి ఎం ఎ స్టూడెంట్స్ అండ్ మెంబర్స్ కన్వెన్షన్, ఆదివారం ఉదయం గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు ఇందిరా ప్రియదర్శిని సిల్వర్ జూబిలీ ఆడిటోరియం, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిఎంఎఐ ప్రెసిడెంట్ సిఎంఎ బిభూతి భూషణ్ నాయక్, వైస్ ప్రెసిడెంట్ సిఎంఎ టి.సి.ఏ. శ్రీనివాస ప్రసాద్, సి సి ఎం సిఎంఎ వినయ్ రంజన్, సిఐఆర్ సి ఛైర్మన్ సిఎంఎ విశ్వనాథ్ భట్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిచారు. అంతేగాక, ప్రముఖ సిఎంఎ లు, పరిశ్రమల నుండి నిపుణులు, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ రంగాల నుండి ప్రముఖులు సిఎంఎ విద్యార్థులకు మార్గదర్శనం చేసారు. ముఖ్యంగా "కామర్స్ విద్యార్థులు ఫైనాన్స్ కోర్సు పై అవగాహన పెంచుకోవడానికి ఇదో మంచి అవకాశం అని తిరుపతి చాప్టర్ ఛైర్మన్ డా. సిఎంఎ పార్థ సారథి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిఎంఎఐ విద్యార్థులు, మెంబర్లు, అకాడెమిషియన్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ ప్రొఫెషనల్స్, ఇండస్ట్రీ ప్రతినిధులు, ఇతర కామర్స్ విద్యార్థులు. (సిఎ, సిఎస్, ఎంబిఎ ఫైనాన్స్, బీకాం, ఎం కామ్) తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటి సలహాదారునికి సన్మానం:అభివృద్ధికి విన్నపం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం నియమించిన మైనారిటి ముస్లిం ప్రభుత్వ సలహాదారులు ఎంఏ షరీఫ్‌ను ఆదివారం రాష్ట్ర మైనారిటి కార్యనిర్వాహక కార్యదర్శి షాకిర్ అలి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మైనారిటిల అభివృద్దికి వారి ఆస్తుల పరిరక్షణకు పలు అభ్యర్థనలు చేసినట్లు వివరించారు. ఇందులో ప్రధానంగా గత ప్రభుత్వం హయాంలో ముఖ్యమంత్రి, తెలుగుదేశం నాయకుడు నారాచంద్రబాబు నాయుడు మైనారిటీలకు ఎన్నో వెసులుబాట్లు కల్పించారని వాటిలో ప్రధానంగా రంజాన్ తోఫా, దుల్హన్, హజ్ సబ్సిడీల వంటి సామాజిక కార్యక్రమాలను గత ప్రభుత్వం రద్దు చేసిందని అంతేకాక మైనారిటీలకు సంబంధించిన మసీదులు, ఈద్‌గాహ్‌ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరుకు ప్రభుత్వానికి సూచించాలని కోరారు. ఈ అభ్యర్థనకు స్పందించిన షరీఫ్ మాట్లాడుతూ మైనారిటీ ముస్లింలకు సంబంధించిన అన్ని పథకాలను మళ్ళీ ప్రారంభించుటకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. అంతేకాక ఉర్దు పాఠశాలలు శిధిలావస్థకు చేరుకున్నాయని ఉర్దు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచుటకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. షాదిమహల్స్ అభివృద్ధికి శ్మశానాల రక్షణకు ప్రహరీలను నిర్మించుటకు ప్రత్యేక నిధుల కేటాయింపుకు ప్రయత్నిస్తున్నట్లు వివరించారు.

## ఓపెన్ ప్లేస్‌లో మద్యం సేవించటం నిషేధం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోనూ, పరిసరాల్లో ఖాళీ ప్రదేశాలు, ఆలయ పరిసరాల్లో మద్యం సేవించటం నిషేధమని పట్టణ సిఐ డి.గోపి వివరించారు. ఆదివారం రాత్రి శ్రీకాళహస్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆటమైదానంలో కొందరు యువకులు విచ్చల విడిగా కూర్చొని మద్యం సేవిస్తుండగా నలుగురిని అదుపులో తీసుకున్నట్లు వివరించారు. పుణ్యక్షేత్రంలో బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు ఇబ్బంది కల్గించే విధానాలపై పోలీసులు నిఘా పెట్టారన్నారు. దాంతో ప్రతిరోజూ రాత్రి గస్తీ ముమ్మరం చేసామన్నారు. రాత్రి 11 గంటలు దాటిన తరువాత ఎవ్వరూ అత్యవసరం అయితే తప్ప బయట రాకూడదన్నారు.

## శివయ్య సేవలో రాజస్తాన్ ఎంఎల్ఏ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో రోజు రోజుకు దేశ విదేశాల ప్రతినిధులు, అతి థులతో కిట కిట లాడుతుంది. ఈ నేప ధ్యంలో ఆదివారం శ్రీకాళహస్తీశ్వరా లయంలో ఇసుకేస్తే రాలనంత రద్దీ చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో రాజస్తాన్ అల్వార్ నియోజకవర్గ బిజెపి ఎంఎల్ఏ మహంత్ బలక్‌నేతాజి తన పరివారంతో శివయ్య దర్శనానికి వచ్చారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద పిఆర్ఓ రవి వేదపండితులతో స్వాగతం పలికారు. ఆయనతో పాటు వారి పరివారం ఉంది. చందూ రాయల్ దర్శన ఏర్పాట్లును పర్యవేక్షించారు. స్వామి అమ్మవార్ల అ ంతరాలయ దర్శనం తరువాత మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలను అందించారు.

## నగార్చిపాళెం దీపాలకు మరమ్మతులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మున్సిపాలిటిలోని నగార్చిపాళెంలో నెల రోజులుగా వీధి దీపాలు వెలగటం లేదనే ఆరోపణలపై ఆదివారం మున్సిపల్ విద్యుత్‌శాఖ పర్యవేక్షకులు ఎలక్ట్రిషియన్ రవి పరిశీలించారు. ఈ వీధిలోని ప్రజల్ని విచారించారు. అయితే ఈ వీధిలో రెండు లైట్లు మాత్రమే వెలగటం లేదని వివరించారు. వాటిని మరమ్మతులు చేసి వెలిగించారు. ప్రజలు మున్సిపల్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

## క్రమబద్దీకరణకు ప్రభుత్వం ఆదేశాలు

తొట్టంబేడు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త



వివిధ ప్రాంతాల్లో భూముల క్రమబద్దీకరణకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసిందని ఈ మేరకు ఇప్పటికే వివాదాల్లో ఉన్న భూముల క్రమబద్దీకరణకు మండలంలోని వారు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకొనుటకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం క్రమబద్దీకరణకు మీసేవ, గ్రామ వార్డు, సచివాలయాల ద్వారా దరఖాస్తుల స్వీకరణకు ఆదేశించినట్లు రెవెన్యూ అధికారులు సూచించారు. ఈ క్రమబద్దీకరణతో ఎంతో మంది నిరుపేదలకు మేలు చేకూరనున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం పేర్కొనింది, క్రమబద్దీకరణ మేరకు లబ్దిదారులకు పట్టా కన్వేయన్స్ డీడ్ అందజేసిన రెండేళ్ళ తరువాత యాజమాన్య హక్కును జారి చేస్తామని రెవెన్యూశాఖప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. తమ పూర్తి వివరాలను నిర్దేశించిన ధృవీకరణ పత్రాల మీద మీ సేవలో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్దీకరణ చేస్తామని, రిజిస్ట్రేషన్ ఫీజు సైతం చెల్లించనక్కర్లేదని తెలిపారు. దారిద్రరేఖకు దిగువను ఉండి 150-300 గజాల లోపు ఆక్రమణలకు బేసిక్ ధరలో 15శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50శాతం చెల్లించాలని, 300-500 గజాల పరిధిలో బిపిఎల్ కుటుంబాల వారు వంద శాతం బేసిక్ ధర, 50శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. లేఅవుట్ స్థలాలు, కాలువలు, నదీ ప్రవాహ గట్లు, మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లో నిర్దేశిత స్థలాలు, జలవనరులకు సంబంధించిన స్థలాల్లో క్రమబద్దీకరణ చేయడం కుదరదు. లబ్దిదారులు, కుటుంబ సభ్యులు ఐటి చెల్లింపుదారులై ఉండకూడదని, గరిష్టంగా గ్రామాల్లో నెలకు రూ. 10వేలు, పట్టణాల్లో 14వేలు ఆదాయం ఉన్నవారఉ అర్హులుగా నిర్ణయించగా, నెలకు రూ.300లోపు విద్యుత్ చార్జీల చెల్లింపు ఉండాలన్నారు. ఇప్పటికే స్వీకరించి, ఎపెండింగ్‌లో ఉన్న దరఖాస్తులనూ పరిగణలోకి తీసుకొంటామని ప్రభుత్వం ఆదేశించింది.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

తొట్టంబేడు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి-నాయుడుపేట మార్గంలోని తొట్టంబేడు మండలం పెద్ద కన్నలి పెట్రోల్‌బంకు సమీపంలో ఓ స్కూటరిస్టు వేగంగా వాహనం నడుపుతూ అదుపు చేయలేక జారి పడి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుందని టూటౌన్ సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. యువకుడు వేగంగా స్కూటి నడుపుతూ వేగాన్ని కంట్రోల్ చేయలేక జారి పడినట్లు పక్కన మోటార్‌సైకిళ్ళపై వెళుతున్న వారు సమాచారం అందించారని సిఐ వివరించారు. సంఘటన సమాచారం అందిన వెంటనే పోలీసులు చేరుకున్నారు.

# తిరుపతి డివిజన్

## కొత్త సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

ఎమ్మెల్యే భానుప్రకాశ్

పుత్తూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :



నగరి నియోజ కవర్గంలోకొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతి పాదనలు సిద్ధం చేయాలని విద్యుత్ శాఖాధికారులను ఎమ్మెల్యే గాలి భానుప్ర కాశ్ ఆదివారం ఆదేశించారు. రానున్న వేసవి కాలంలో విద్యుత్ వినియోగం పెరుగుతుందని దాని వల్ల లోవోల్టేజి తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. వేసవి కాలంలో ఏర్పడే సమస్యలను దృష్టిలో వుంచుకుని ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలన్నారు. వడమాలపేట మండలం ఎస్వీపురం వద్ద 132/33 కెవి సబ్‌స్టేషన్ ఏర్పాటు ప్రతిపాదనపై అధికారులతో చర్చించారు. బుట్టిరెడ్డికండ్రిగ, కెబిఆర్‌పురంలో నిర్మాణంలో వున్న సబ్‌స్టేషన్ల పురోగతి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యుత్ శాఖాధికారులు ఎమ్మెల్యేలు శాలువాతో సత్కరించారు. సమీక్షలో పుత్తూరు డిఇ దేవ ఆశీర్వాదం, ఇతర ఇంజనీరింగ్ అధికారులు బాలాజీ, భాస్కర్‌నాయుడు, ఎఇ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మా పొలాన్ని ఇప్పించి.. మా కుటుంబాలకు ప్రాణ రక్షణ కల్పించండి

– బాధిత ఐదు కుటుంబాల రైతుల ఆవేదన

తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త ః




దొంగ స్వామి, రౌడీ షీటర్ అలియాస్ కె.సురేంద్రబాబు నుంచి మా పొలాన్ని మాకు ఇప్పించి అతని నుంచి అతడి అనుచరుల నుంచి మాకు ప్రాణరక్షణ కల్పించాలని ఐదు కుటుంబాలకు చెందిన బాధిత రైతులు వై. గంగిరెడ్డి, వై.నాగిరెడ్డి, వై.రమేష్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, వై.ప్రమీల కన్నీరు మున్నీరయ్యారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వై.గంగిరెడ్డి కుమారుడు వై.నాగిరెడ్డి మాట్లాడారు. తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు సమాజం వీధిలో మా ఐదు కుటుంబాలు జీవనం సాగిస్తున్నామని, మా తాత ముత్తాల నుంచి పైమాషి నెం.464లో 12 ఎకరాల పొలం ఉందని, ఆ పొలంలో మా ఐదు కుటుంబాలు ప్రతి ఏటా వరి, శెనగ, ఇతర పంటలు వేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే దొంగస్వామి, రౌడీ షీటర్ అలియాస్ కె.సురేంద్రకుమార్ 12 ఎకరాల్లో కొంత భూమిని కౌలు ఇస్తే తాను జీవనం చేసుకుని బ్రతుకుతానని బ్రతిమలాడి తీసుకుని అందులో మొదట గుడిసె వేసి వారాహి మాతా ఆలయాన్ని నిర్మించి, తిరుచానూరు శ్రీ పద్మావతి ఆలయానికి వస్తే భక్తులను, యాత్రికులను, ప్రధానంగా మహిళలను ప్రత్యక్షంగా, పరోక్షంగా మోసం చేస్తూ, మా పొలాన్ని ఆయన పొలంగా దొంగ పత్రాలు సృష్టించి మమ్మల్ని చంపుతామని నిత్యం బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని, దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని, పోలీసులు అతడికి వార్నింగ్ ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందని బాధపడ్డారు. ఇకనైనా జిల్లా ఎస్పీ, కలెక్టర్, తిరుచానూరు పోలీసులు వెంటనే స్పందించి అతని, అతని అనుచరుల నుంచి మా పొలాన్ని మాకు ఇప్పించి మాకు న్యాయం చేయడంతో పాటు అతడి, అతని అనుచరుల నుంచి ప్రాణ రక్షణ కావాలని బాధిత కుటుంబాలు కోరారు.

## శ్రీమల్లాలమ్మ వారికి ఎంఎల్ఏ పట్టువస్త్రసాలు



చంద్రగిరి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

శ్రీమల్లాలమ్మ వారికి ఎంఎల్ఏ పులివర్తి నాని పట్టువస్త్రాలు సమర్పించారు. మండల పరిధిలోని మిట్టపాళ్యం సమీపంలో మేదర సంఘం ఆధ్వర్యంలో శ్రీమల్లాలమ్మ వారి జాతర వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మేదర సంఘం నాయకుల ఆహ్వానం మేరకు జాతర వేడుకలకు హాజరైన ఎంఎల్ఏని సంఘం నాయకులు ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన శ్రీమల్లాలమ్మ వారిని దర్శించుకోవడం ఆనందంగా వుందన్నారు. నియోజకవర్గంలో ప్రజలందరూ సుఖశాంతులతో వర్థిల్లాలని ఆకాంక్షించారు.

## "ప్లాస్టిక్ ఫ్రీ నేషన్" విత్ "స్టూడెంట్ నేషన్"

మోడల్ కాలనీ కోసం ముందడుగు




తిరుపతి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

తిరుపతిలో ప్లాస్టిక్ ఫ్రీ నేషన్ (నినాదంతో) విత్ స్టూడెంట్ నేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వెంకటరమణ కాలనీలో విద్యార్థులు ముందడుగు వేశారు. ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకై స్టూడెంట్ నేషన్ (అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు) టీమ్, రోటరీ క్లబ్, ప్లాస్టిక్ ఫ్రీ తిరుపతి టీమ్ సహకారంతో వెంకటరమణ లేఅవుట్‌లో రెండు రోజుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రెండు రోజుల పాటు 10 వీధులలోని 500 కుటుంబాలతో మమేకమైన వాలంటీర్స్ ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే దుష్పరిణామాలను వివరించారు. ప్లాస్టిక్‌లో ప్లాస్టిక్‌ను హైలెట్ చేయడం వంటి ఆలోచనల ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాల ప్రభావాన్ని దృశ్యమానంగా ప్రదర్శించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకుని పర్యావరణ అనుకూలత పద్ధతులను అనుసరించడాని న్ స్థిరమైన ప్రత్యామ్నాయ పద్దతులపై అవగాహన కల్పించారు. తద్వారా వెంకటమణ లేఅవుట్‌ను ఆదర్శ కాలనీగా మార్చేందుకు మొదటి అడుగు వేశారు. గత 18 నెలలుగా తిరుపతిలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు ప్లాస్టిక్ ఫ్రీ తిరుపతి టీమ్ విశేష కృషి చేస్తున్నట్లు వివరించారు. తిరుపతిని ఒక స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా స్టూడెంట్ నేషన్ సైతం భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాన్ని స్టూడెంట్ నేషన్ అధ్యక్షురాలు హర్షిణి మల్లెల, కార్యదర్శి ధర్మయ్యగారి త్రివిక్రమ్ రెడ్డి నేతృత్వంలో ప్రణవ్, సాగర్, పుష్కర్, హర్షిత, హారికా, పావనీ, ప్రవీణ్, సుదర్శన్, మధు, అభినవ్, నాగ, స్వచ్ఛంధ సేవకులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ అధ్యక్షుడు సోమురవి, ప్లాస్టిక్ ఫ్రీ తిరుపతి టీమ్ ప్రతినిధులు గీత, శివాజీ మార్గదర్శనం కలిగించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రమాదవశాత్తు రాయలచెరువులో పడి యువకుడు మృతి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:



ప్రమాదవశాత్తు రాయలచెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. ఎస్ఐ రామాంజనేయులు వివరాల మేరకు.. రాయలచెరువు పేట గ్రామానికి చెందిన పి.లోకేష్ (23) సి.రామాపురం లోని వెరిటాస్ సైనిక్ స్కూల్ బస్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం విధులు ముగించుకుని తన స్నేహితుడు లీలాకృష్ణను మోటార్ సైకిల్‌పై నెత్తకుప్పంలో విడిచిపెట్టి తిరిగి ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు రాయలచెరువులోపడి మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్ సంఘటనా స్థలికి చేరుకుని చెరువులో నుండి మృతదేహాన్ని వెలికితీశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

## విద్యానగర్‌లో వాహనాలు తనిఖీ

కోట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లో ఆదివారం సాయంత్రం ఎస్‌ఐ పవన్‌కుమార్ పోలీసు సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. విద్యానగర్ సెంటర్లో వాహనాలను ఎస్‌ఐ వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు తెలుసుకున్న పలువురు కోట నుంచి వచ్చే వారు విద్యానగర్ సాయిబాబా మందిరం రోడ్డు వైపు, గూడలి వైపు దారి మళ్లాయి. అలాగే గూడూరు నుంచి కోట వైపు వచ్చే దిచక్ర వాహనాలు, ఆటోలు కొత్తపాలెం రోడ్డు వైపుగా చెందోడు గ్రామంలోకి వచ్చి ఆ మార్గం గుండా కోటకు వెళ్లాయి. హెల్మెట్లు ధరించని ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదు చేస్తుండటంతో వాహనదారులు ఇతర మార్గాల్లో వెళ్లారు.

## అథ్లెటిక్ పోటీలకు భరత్ మహీపతి ఎంపిక




చిట్టమూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:చిట్టమూరులోని గణపర్తి మార్కండేయులు నాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న భరత్ మహీపతి రాష్ట్రస్థాయి వెటరన్ అథ్లెటిక్ పోటీల్లో బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనాకుమారి తెలిపారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లఓ అనంతపురం పట్టణంలో పోలీస్ పెరేడ్ ట్రెనింగ్ సెంటర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి 43వ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని హామర్ త్రో అంశంలో బంగారు పతకం సాధించినట్లు ఆమె తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా తరఫున పాల్గొని పాఠశాలకు వన్నె తెస్తూ జాతీయ స్థాయిలో పాల్గొనబోతున్న భరత్ మహీపతిని ఆమెతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. మార్చి 8, 9, 10, 11 తేదీల్లో బెంగళూరులోని కంఠీరవ జాతీయ అథ్లెటిక్ స్టేడియంలో జరిగే జాతీయ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొనబోతు న్నారని హెచ్‌ఎం తెలియజేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

## మెరుగైన వైద్యం అందించడానికి చర్యలు : ఎమ్మెల్యే



చిల్లకూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో ఆసుపత్రిలో అన్నీ సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నా మని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. చిల్లకూరు మండలం లోని చింతవరం గ్రామంలో ఏర్పాటై ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ నిర్మాణానికి ఆయన శంకు స్థాపన చేశారు. చిల్లకూరు మండలంలోని చింతవరం గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ నిర్మాణం జరగనుంది. ఈ నేపథ్యంలో భాగంగా ల్యాబ్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, వైద్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రిలో ల్యాబ్ నిర్మాణానికి 50 లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని ఆయన వివరించారు.ఇంకా మరికొందరు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఉచురు వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు దువ్వూరు వినయ్‌రెడ్డి, దువ్వూరు ప్రవీణ్‌రెడ్డి, శివకుమార్, సాయి, పద్మజ, అన్నం మునిశేఖర్ గౌడ్, డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొబ్బరికాయల ధరకు రెక్కలు

కోట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : కొబ్బరికాయ ధర విపరీతంగా పెరిగింది. కొనాలంటే సామాన్య ప్రజలు వెనుకంజ వేస్తున్నారు. ప్రస్తుతం మాఘమాసంలో పూజలు, శుభకార్యాలు, అధికంగా జరుగుతున్నాయి. గుడికి వెళ్లాలంటే పూజా సామగ్రితో పాటు రెండు టెంకాయలు కొనాలంటే వంద చాలడంలేదు. గతంలో టెంకాయల అంగళ్లల రూ.10 నుంచి 20 వరకు ధర ఉండేది. ప్రస్తుతం కాయ సైజును బట్టి రూ.40 నుంచి రూ 50కి విక్రయిస్తున్నారు. స్థానికంగా తోటల్లో కాయలు లేకపోవడంతో కర్ణాటకల్లోని తుమకూరు, టిప్టూర్, చిత్రదుర్గ తదితర ప్రాంతాల నుంచి కొబ్బరికాయల కొని తీసుకోస్తున్నారు. తోటల వద్దనే వంద కాయలు రూ. 2.500 ధర పలుకుతోందని వ్యాపారులు చెబుతున్నారు.

**తమలపాకులూ అంతే..**

ప్రస్తుతం చలికాలంలో ఆకుల దిగుబడి అంతంత మాత్రమే ఉంటుంది. ఎండా కాలంలో ఎకరా తోటకు ఎనిమిది నుంచి పది పెండీ (100 కట్ట ఒక పెండీ)ల దిగుబడి వచ్చేది. ప్రస్తుతం మూడు నుంచి నాలుగే వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఆకు దిగుబడి రాకపోవడంతో మార్కెట్‌ల ధర గణనీయంగా పెరిగింది.

# గూడూరు డివిజన్

## జాగృతమౌతున్న హిందుత్వం : కంకణాల



గూడూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : జాగృతమౌతున్న హిందుత్వం ఢిల్లీలో కేజ్రీవాల్ మట్టి కరవడం అనేక వర్గాల వారినీ కలవరపరచిందని భారత్ వికాస్ పరిషత్ వైస్ ప్రెసిడెంట్ కంకణాల పెంచల నాయుడు అన్నారు. మధ్య తరగతి ఎగువ మధ్య తరగతి జనాభా అధికంగా ఉన్న ఢిల్లీలో మతతత్వ పార్టీగా ప్రచారం కాబడుతున్న బిజెపి గెలవడం ఎంతో మంది కుహనా సెక్యులరిస్టులకు మింగుడు పడటం లేదన్నారు. బౌద్ధం ముసుగులో, సెక్యులరిజం ముసుగులో నాస్తికత్వ ముసుగులో హిందుత్వ ంపై సనాతన భావజాలంపై జరుగుతున్న దాడిని హిందూ సమాజం ఇప్పుడిప్పుడే అవగతం చేసుకుంటుందన్నారు.ఆంధ్రలో జగన్ ఓటమికి కూడా కారణం ఇదే. మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలు కూడా అగ్నికి ఆజ్యం పోయడంతో బీజేపీ గెలుపు నల్లేరు మీద నడకగా మారింది.

## వైసిపి కార్యకర్తలను ఇబ్బంది పెడితే వదిలిపెట్టను : కాకాని



గూడూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వైసిపి సానుభూతి పరులపై అక్రమంగా కేసులు పెట్టించి వారిపై దాడులు చేయిస్తున్నారని అక్రమంగా వైసిపి కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ఏ అధికారులను వదిలిపెట్టమని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి వెల్లడించారు. గూడూరు మండలం మంగళపూర్ గ్రామంలో వైసిపి సానుభూతి పరుడు సతీష్ యాదవ్‌ను మాజీ మంత్రి పరామర్శించారు. సతీష్ యాదవ్‌ను పోలీసులు ఒక కేసు నిమిత్తం స్టేషన్‌కు తీసుకువెళ్లి కొట్టి గాయపరిచారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డికి తెలియజేయడంతో ఆదివారం మాజీ మంత్రి కాకాని, ఎమ్మెల్సీ మేరీగా మురళి మంగళపూర్ గ్రామానికి విచ్చేశారు. స్థానిక నాయకులు ఎద్దల నరేందర్‌రెడ్డి మాజీ మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం సతీష్ యాదవ్‌నివాసానికి వెళ్లి యువకుడిని పరామర్శించి వివరాలను అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, ఎంపీపీ గురవయ్య, వాయిగండ్ల నాగరాజా, సునీల్ రెడ్డి, రాధారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలపై దృష్టిపెట్టడం అభినందనీయం : ఎమ్మెల్యే



చిల్లకూరు, ఫిబ్రరి 9 ప్రభాతవార్త : క్రికెట్ పోటీల్లో గెలిచిన మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగించడం అభినందనీయమని ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు. చిల్లకూరు మండలంలోని కలవకొండలో సీనియర్ క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ పోటీల కార్యక్రమానికి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సురేష్ బాబు, అసోసియేషన్ అధ్యక్షుడు చేవూరు నాగరాజు, ఆర్గనైజర్లు మోహన్, రఘుబాబు, మధు తదితరులు పాల్గొన్నారు. చిల్లకూరు మండలం కలవకొండలో మండల సీనియర్ క్రికెట్ టోర్నమెంట్ రెండు రోజులపాటు జరిగాయి. పోటీల్లో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్లో సిలికా లెవన్స్‌పై గ్రావెల్ లెవన్స్ విజయం సాధించింది. 51 పరుగుల విజయ లక్ష్యం తో బ్యాటింగ్‌కి దిగిన సిలికా లెవన్స్ 49 పరుగులు చేయడంతో గ్రావెల్ లెవన్స్ విజయం సాధించింది. క్రికెట్ పోటీలు సంబంధించి ట్రస్ట్‌కు 50 వేల రూపాయలు ఎమ్మెల్యే సునీల్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సురేష్ బాబు, అసోసియేషన్ అధ్యక్షుడు చేవూరు నాగరాజు, ఆర్గనైజర్లు మోహన్, రఘుబాబు, మధు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలి : ఎంఈఓ

వెంకటగిరి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లి పుత్ర పట్టణం చేసి మేధో శక్తిని పెంచుకోవాలని తెలిపారు. వెంకటగిరిలోని గ్రంథాల యంలో మదర్ అకాడమీ పాఠశాల విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తకపఠణం చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు వెళ్లే ముందు, పాఠశాలలు వదిలిన తర్వాత సెలవు దినాల్లో గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠణం, దినపత్రికలు చదవాలని తెలిపారు, గ్రంథాలయాలు విజ్ఞాన గనులన్నీ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అల్లిశెట్టి అంజయ్య సిబ్బంది పాల్గొన్నారు.

## భారత్ సంచార్ నిగమ్‌కు పూర్వవైభవం

కోట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : ప్రభుత్వ రంగ సంస్థ సంచార్ నిగమ్ లిమిటెడ్ ( బీఎస్ఎన్ఎల్ )కు పూర్వ వైభవం వస్తోంది. ఇన్నాళ్లు 2జీ,3 జీ తో వెనకబడిన సంస్థ ఇప్పుడు 4జీ సేవలతో దూసుకుపోతూ ప్రైవేటురంగ సంస్థలకు సవాల్ విసురుతోంది. వినియెగదారుల సంఖ్య రోజు రోజుకు పెరుగోతంది. గతేడాది సంస్థ ఉద్యోగులు కొందరు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ తీసుకున్నారు. సంస్థ ప్రైవేటే పరం అవుతుందని ప్రచారం సాగింది. ఈ తరణంలో వినియోగదారలు ఇతర ప్రైవేటు సంస్థలను ఆశ్రయించారు. ఉన్నట్టుండి ప్రైవేటు సంస్థలు సేవలు ధరలు విపరీతంగా పెంచాయి. ఈదశలోనే పలు సంస్కరణలతో బీఎస్ఎన్ఎల్‌ను ప్రక్షాళన చేసి బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో వినియోగదారులు ఆ సంస్థ వైపు ధరలతో 12 రకాల పథకాలు అందుబాటులో ఉన్నాయి. ధరలు పెంచకపోవడంమే కాకుండా ప్రైవేటు కంపెనీలకు దీటుగా 4 జీ సేవలను అందుబాటలోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తుండటం వినియోగదారులు ఆకర్షిస్తోంది.

**అనూహ్య స్పందన :**

బీఎస్ఎన్ఎల్‌కు అసాధారణ రీతిలో ఆదరణ పెరుగుతోంది. ఈ రెండు నెలల్లో నే వినియెగదారులు సంఖ్య గణనీయంగా పెరిగింది. వైపు సేవలు నాణ్యత పెంచేందుకు ఫైబర్ టూ హోమ్ కనెక్షన్లు ఇస్తున్నారు. ఉద్యోగులు సైతం సంస్థ సేవలను ప్రజల్లో తీసుకెళ్తున్నారు. ప్రదర్శనలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఉచితంగా సిమ్ కార్డులు అందిస్తూ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు.అతి తర్వలోనే 4జీ సేవలను ప్రజలకు అందిస్తామని ఎఇ తెలిపారు.

## వాహనాల్లో కార్డెన్ అండ్ సెర్చ్



వెంకటగిరి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : జగనన్న కాలనీలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించగా ద్విచక్ర వాహనాలు రెండు ట్రక్కు వ్యాన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వెంకటగిరి మున్సిపల్ పరిధిలోని జగన్ కాలనీలో దక్కిలి, బాలయపల్లి, వెంకటగిరి పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, సిబ్బందితో కలిసి కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ కాలనీలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని సమాచారం మేరకు అకస్మాత్తుగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని, 5 ద్విచక్ర వాహనాలను, 2 ట్రక్కు వ్యాన్లు సీజ్ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సుబ్బారావు సిబ్బంది పాల్గొన్నారు.

## మండుతున్న ఎండ.. భయపడుతున్న జనం

కోట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : ఫిబ్రవరి రెండు వారంలోని ఎండలు, మరోపక్క విద్యుత్ సరఫరా లేక ఉక్కపోత. గత కొన్నిరోజులుగా వాతావరణం నరకం చూపిస్తోంది. జిల్లాలో పగటి ఉష్ణోగ్రత 35 డిగ్రీల వరకు నమోదవుతోంది. మరో వేసవిని తలపిస్తూ, వేడి వాతావరణాన్ని జనం తట్టుకోలేక పోతున్నారు. మరోవైపు ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వినియోగం బాగా పెరుగుతుండటంతో విద్యుత్‌కు డిమాండ్ అమాంతంగా గరిష్ట స్థాయికి చేరుకుంది. సాయంత్రం వరకు ఎండ ఏమాత్రం తగ్గడం లేదు. సాధారణంగా మార్చి నెలలో ఎండల అధిక ఉష్ణగ్రతలు నమోదు అవుతాయి. కానీ ఈ సారి ఫిబ్రవరి రెండు వారంలోని ఉష్ణగ్రతలు ఆమాంతగా పెరగడంతో ప్రజలు విలవిలాడుతున్నారు.

## బ్రాహ్మణపల్లె సమీపం చెరువులో వ్యక్తి గల్లంతు!



వెదురుకుప్పం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : మండలంలోని బ్రాహ్మణపల్లె సమీపంలో చెరువులో ఓ వ్యక్తి గల్లంతైన్నట్లు స్థానికులు తెలిపారు. స్థానికుల కథనం మేరకు.... మండలంలోని బ్రాహ్మణపల్లె సమీపంలో చెరువులో ఓ వ్యక్తి ప్రమాదవశాతు చెరువులో మునిగిపోయినట్లు తెలిపారు. కాగా తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం దొర్నకంబాల గ్రామానికి చెందిన శ్రీనాథ్ రెడ్డి వెదురుకుప్పంకు సొంత పనులు నిమిత్తం వచ్చి ముగించుకుని తిరిగి దోర్నకంబాలకు వెళ్ళుతూ మార్గమధ్యలోగల బ్రాహ్మణపల్లె సమీపంలో చెరువు వద్దకు వెళ్ళి ప్రమాదవశాతు చెరువులో మునిగి గల్లంతైన్నట్లు తెలిసింది. కాగా సమాచారం తెలిసి స్థానికులు పెద్ద సంఖ్యలో చెరువు వద్దకు చెరుకుని వ్యక్తి ఆచూకీ కోసం ప్రయత్నించిన ఫలితంలేకపోయింది. దీంతో పుత్తూరు అగ్నిమాపక కేంద్రంకు సమాచారం అందించడంతో రాత్రి అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలంకు చెరుకున్నారు. వారి ప్రయత్నంతో గల్లంతైన వ్యక్తి సమాచారం తెలియావల్సి ఉంది.

# పిల్లల ఆరోగ్యం పెంపొందించడానికే డీవార్మింగ్

**- 1-19 సంవత్సరాల మధ్య వయస్కులందరికీ నేడు ఆల్బెండజోల్ మాత్రలు - నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం - కలెక్టర్**

చిత్తూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: పిల్లల ఆరోగ్యం మరింత పెంపొందించడానికి జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా సోమవారం 1-19 సంవత్సరాల వయస్సు కల్గిన విద్యార్థులందరికీ అల్బెండజోల్-400 ఎంజి మాత్రలు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులందరికీ ఆల్బెండ జోల్ మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. పిల్లల కడుపులోని కొంకి పురుగులు, నులిపురుగులు, బద్దె పురుగులు, గుండ్రని పురుగులు నివారించడం ద్వారా పిల్లల ఆరోగ్యవృద్ధి పెంపొందించి తద్వారా ఉన్నత పౌరులుగా ఎదగడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. పిల్లల, కిషోర బాలుల కడుపులో నులిపురుగులు ఉన్నట్లైతే పోషకాహారలోపం, రక్తహీనత వల్ల నీరసంగా వుంటారని, అలాగే శారీరక, మానసిక ఎదుగుదల లోపాలు కలిగి వుంటారని దీని నుండి పిల్లలను కాపాడేందుకు ఆల్బెండజోల్ మాత్ర తప్పనిసరిగా వేయాలన్నారు. 1-2 సంత్సరాల వయస్సు వున్న పిల్లలకు ఆల్బెండజోల్-200 ఎంజి అర్ధ మాత్ర, 2-19 సంవత్సరాల పిల్లలందరికీ అల్బెండజోల్-400 ఎంజీ ఒక మాత్ర మధ్యాహ్నం భోజనం తరువాత చప్పరిస్తూ మింగించడం చేయాలన్నారు. జిల్లాలో 2,420 అంగన్‌వాడీ కేంద్రాల్లో 76,924 మంది పిల్లలు, 2,883 ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 2,36,691 విద్యార్థులు, 163 ప్రభుత్వ, ప్రైవేటు ఇంటర్మీడియేట్, పాలిటెక్నిక్, ఐటిఐ, నర్సింగ్ కళాశాలల్లో 43,787 విద్యార్థులు, అలాగే బడి బయట 4,486 మంది పిల్లలు వున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలు, ప్రాథమిక పాఠశాలల్లోని బడి, బడి బయట విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. అలాగే ఎఎన్ఎంల ద్వారా ఉన్నత రెసిడెన్షియల్ ఆశ్రమం, మోడల్ స్కూల్, కేజీబివి గురుకుల, మైనార్టీ పాఠశాలల్లోని పిల్లలు, ఇంటర్మీడియేట్ విద్యార్థులకు మాత్రలు మింగించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం డీవార్మింగ్ చేయని పిల్లలకు ఫిబ్రవరి17వ తేదీన ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించాలన్నారు.

ఈ కార్యక్రమంలో విద్యాశాఖ, వైద్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమీషనర్లు, సంక్షేమ హాస్టల్ అధికారులు సమన్వయంతో పని చేసి ఈ కార్యక్రమంను వందశాతం విజయవంతం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.

## పోలీసు శాఖకు వెన్నుముక ఏఆర్ విభాగం

**- ఎస్పీ మణికంఠ చందోలు**



చిత్తూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: పోలీసు శాఖకు వెన్నుముక లాంటిది ఏఆర్ విభాగమని ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. చిత్తూరు పెరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం జరిగిన చిత్తూరు జిల్లా ఏఆర్ బలగం వార్షిక మొబిలైజేషన్ ముగింపు కార్యక్రమానికి ఎస్పీ మణికంఠ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ చందోలు ఏఆర్ విభాగం సిబ్బంది, అధికారులతో గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ ఏఆర్ సిబ్బంది, అధికారులను గత పదిహేను రోజులుగా ఏఆర్ సిబ్బంది, అధికారులకు పెరేడ్ నిర్వహణ, విఐపి సెక్యూరిటీ, రక్షణ, ఆయుధాలను వినియోగించడంలో మెళకువలు, ఫైరింగ్ ప్రాక్టీసు, బందోబస్తు నిర్వహించాల్సిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, అత్యవసర పరిస్థితుల్లో ఎంఒబి కంట్రోల్ వంటి అన్ని రకాల నైపుణ్యాలను పునఃసమీక్షించి వాటిలో నిష్ణాతులుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఏఆర్ బలగం జిల్లా బలగానికి వెన్నుముక లాంటిదని, వీరి ఉద్యోగం వైవిధ్యభరితమే కాకుండా కష్టతరంగా వుంటుందన్నారు. ఈ పదిహేను రోజుల నైపుణ్య పునఃశ్చరణ కార్యక్రమంలో అన్ని రకాల నైపుణ్యాలను పూర్తి క్రమశిక్షణతో నేర్చుకోవడం అభినందనీయమన్నారు. తమ విధి నిర్వహణలో వృత్తి నైపుణ్యం పెంపొందించేలా ఈ కార్యక్రమంను నిర్వహించి పూర్తి చేయడం ఏఆర్ అడిషనల్ ఎస్పీ శివానందకిషోర్, ఏఆర్ డిఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌భాషా, అడ్మిన్ ఆర్ఐ సుధాకర్, ఆర్ఐ ఎంటిఓ భాస్కర్, ఆర్ఐ హోంగార్డ్స్ చంద్రశేఖర్‌లను ఎస్పీ మణికంఠ చందోలు ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఈ కార్యక్రమంలో భాగంగా అపోలో హాస్పిటల్, పోలీసు వెల్ఫేర్ హాస్పిటల్ సహకారంతో ఏఆర్ సిబ్బంది, అధికారులకు ఫస్ట్‌ఎయిడ్, లైఫ్ సేవింగ్ ప్రొసిజర్‌లపై అవగాహన కల్పించారు. అలాగే జిల్లా ఫైర్ ఆఫీసు సహకారంతో ఫైర్ ఫైటింగ్, విపత్తు న్విహణపై అగ్నిని అదుపు చేయడం, ఆపద సమయాల్లో ప్రజల ప్రాణాలు ఎలా రక్షించాలి తదితర నైపుణ్యాలను ఏఆర్ సిబ్బంది ఈ కార్యక్రమం ద్వారా తెలుసుకున్నారు. ఈ పదిహేను రోజుల మొబిలైజేషన్ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన సిబ్బంది, అధికారులకు ఎస్పీ మణికంఠ చందోలు సర్టిఫికేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ అడిషనల్ ఎస్పీ, ఇన్‌ఛార్జీ అడ్మిన్ ఎఎస్పీ రాజశేఖర్‌రాజు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శివానందకిషోర్, ఏఆర్ డిఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌భాషాలు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్లు భాస్కర్, మనోహర్‌లు, అడ్మిన్ ఆర్ఐ సుధాకర్, ఎంటిఓ ఆర్ఐ భాస్కర్, హోంగార్డ్స్ ఆర్ఐ చంద్రశేఖర్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## వరసిద్ధుని సేవలో ప్రభుత్వ విప్ యార్లగడ్డ



కాణిపాకం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: గన్నవరం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్ ఆదివారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించు కున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ సూపరెండెంట్ కోదండ పాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శివరాత్రికి రంగవల్లులు, విద్యుత్ దీపాలతో ముస్తాబులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: దక్షిణకైలాసంగా పేరుపొందిన శ్రీకాళహస్తి పట్టణంలో మహాశివ రాత్రి ఉత్సవాలకు అంగరంగ వైభవంగా ముస్తాబౌతోంది. స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి సూచనలతో ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి ఇంజనీరింగ్ అధికారులను పరుగులు తీయిస్తున్నారు. మరో పది రోజుల్లో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపధ్యంలో ఏర్పాట్లు, అలంకరణలలో అధికారులు తలమునలకలై ఉన్నారు. ఎవరికి వారు తమ సొంత ఇంటి పనుల్లా పరుగులు తీస్తున్నారు.ఓ వైపు ఆలయం మరో వైపు పరిసరాల్లో అభివృద్ధి పనులు చక చకా జరుగుతున్నాయి. ఆలయంలో విద్యుత్ దీపాలు ఆకట్టుకుంటున్నాయి. వారం రోజుల నుంచి ఆలయం లోపల విద్యుత్ దీపాలంకరణలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆలయం అంతా రంగు రంగుల ముగ్గుల మయం చేస్తున్నారు. ఇక విద్యుత్ దీపాలంకరణలో చూడటానికి వేయి కళ్ళు చాలవన్నట్లు మారింది. ఇక బిక్షాల గాలిగోపురానికి అమర్చిన 'ఓం నమఃశివాయ'అనే నూయాన్ లైటింగ్,విద్యుత్ దీపాల తోరణాలు ఇటు తేరువీధి, అటు బజారువీధులను పాల వెలుగుల్లా మార్చేసింది. కృష్ణారెడ్డి మండపం వద్ద బస్సులు దిగే భక్తులకు ఆలయం ఎక్కడో మార్గదర్శక సూచకంగా ఉంది. ఆలయం నుంచి ఇటు కుమారస్వామి కొండ వరకు స్వర్ణముఖి నదిపై ఉన్న వంతెనలపై నాలుగుమాడావీదుల్లో విద్యుత్ తోరణాలు పట్టణానికి ప్రత్యేకంగా ఉన్నాయి. అలాగే రూ.40లక్షలతో రాజగోపురం చుట్టూ రోడ్డు, అంతకు ముందు మురుగునీటి కాలువలు, ఇక తేరువీధి నుంచి సన్నిధివీధికి కొత్తగా రోడ్డు ఏర్పాటు, ఇక వచ్చిన భక్తులు సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించటానికి ధూర్జటి కళాప్రాంగణాన్ని రాజగోపురం పక్కన ఏర్పాటు చేసారు. అభివృద్ధి పనులకు సంబంధించి అనుభవం ఉన్న ఇఇ మురళీధర్‌రెడ్డి వారి బృందం పరుగులు తీస్తుంది.





## వెటర్నరీ జూడాల రక్తదానం

**-ఏడవ రోజుకు చేరిన సమ్మె**

**-సమస్య పరిష్కారమయ్యేవరకు సమ్మె కొనసాగిస్తాం**



తిరుపతి విద్య, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : గౌరవ వేతనం పెంచాలంటూ ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వేదికగా పశువైద్య విద్యార్థులు చేస్తున్న సమ్మె ఏడవ రోజుకు చేరింది. ఆదివారం సమ్మెలో భాగంగా వర్సిటీలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ బ్లడ్ సెంటర్ సహారాంతో ధర్నా శిభిరంలో సుమారు 30 మందికి పైగా వెటర్నరీ జూడాలు రక్తదానం చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ గత ఏడు రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా గౌరవేతనం పెంచడంలో వర్సిటీ అధికారులు,ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.ఈ విషయంపై ఇప్పటికే ప్రజా ప్రతినిధులను,మంత్రులను కలసి తమ గోడును విన్నవించుకున్నామని తెలిపారు.రైతుల శ్రేయస్సు కోరే తమకు అన్యాయం చేయడం దారుణమని, ఇప్పటకైనా అధికారులు స్పందించి అన్ని విభాగాల వైద్య విద్యార్థులకు ప్రస్తుతం ఇస్తున్న స్టైఫండ్ కు సమానంగా తమకు అందించాలని కోరారు.గౌరవ వేతనంపై న్యాయం జరిగేవరకు సమ్మెను విరమించేది లేదని హెచ్చరించారు.నిరవధిక సమ్మెలో సుమారు 300 మందికిపైగా వెటర్నరీ జూడాలు సమ్మెలో పాల్గొన్నారు.

## రేపటి నుండి త్రైమాసిక మెట్లోత్సవం -12న మెట్లపూజ

తిరుమల,ఫిబ్రవరి 9ప్రభాతవార్తప్రతినిధి: ఆధ్యాత్మికనగరం తిరుపతిలో రేపు మంగళవారం నుండి 13వతేదీ గురువారం వరకు మూడురోజులు త్రైమాసిక మెట్లోత్సవం జరుగుతుంది. తిరుపతిలో 11,12తేదీల్లో మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 4గంటల వరకు భజనమండళ్ళు సామూహిక భజన కార్యక్రమాలు , నామసంకీర్తన, ధార్మికసందేశాలు, మహనీయులు మానవాళికి ఉపదేశాలు తెలియజేస్తారు. సాయంత్రం సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 12న ఉదయం 4.30గంటలకు అలిపిరి పాదాలమండపం వద్ద మెట్లపూజ నిర్వహిస్తారు. అనంతరం వేలసంఖ్యలో వచ్చే భజన మండళ్ళ సభ్యులతో సాంప్రదాయ భజనలు చేస్తూ ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారు. 13న ఉదయం 8.30గంటలకు సామూహిక నామసంకీర్తన, 9.30గంటల నుండి స్వామీజీల ధార్మిక సందేశాలు ఇవ్వనున్నారు. దాస సాహిత్య ప్రాజెక్టు మెట్లోత్సవం కార్యక్రమం నిర్వహిస్తోంది.

## ఆండాళ్‌సమేత కృష్ణస్వామిగా తెప్పపై అభయం

తిరుపతి(రవాణ),ఫిబ్రవరి 9(ప్రభాతవార్త: ఆండాళ్‌సమేత శ్రీకృష్ణస్వామి అలంకారంలో గోవిందరాజస్వామి ఉత్సవమూర్తులు ఆదివారం రాత్రి తెప్పపై వేంచేసి పవిత్రమైన పుష్కరిణిలో విహరించారు. గోవిందరాజ



స్వామి వార్షిక తెప్పోత్సవాల్లో నాల్గవరోజు ఆదివారం సాయంత్రంనిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత ఆండాళ్‌సమేత కృష్ణస్వామిని తెప్పపై కొలువుదీర్చారు. అర్చకస్వాములు కర్పూరహారతులిచ్చి తెప్పను కదిలించారు. భక్తుల గోవిందనామస్మరణల మధ్య పుష్కరిణిలో తెప్పపై ఏడుచుట్లు చుట్టి కృష్ణస్వామి భక్తులకు అభయమిచ్చారు. అన్నమాచార్యకళాకారుల భజనలు, హరికథ,సంగీత కార్యక్రమాలు చేపట్టారు. ఈ తెప్పోత్సవాల్లో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు. రాయలసీమ రంగస్థలి నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, కళాకారులు తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, మునినాథరెడ్డి, విక్రమ్‌స్వామి, నరసింహారెడ్డి, కృష్ణమూర్తిరెడ్డి తెప్పోత్సవంలో పాల్గొన్నారు.